RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి | సంపుటి : 3 | సంచిక : 319 | శనివారం | 13 డిసెంబర్ 2025 | పేజీలు : 4 | వెల : రూ. 2.00

## డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం

బెంగళూరు : జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాలపు నర్విభజన చేస్తే, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం వాటిల్లుతుందని, లోక్‌సభలో వాటి ప్రాతినిధ్యం తగ్గుతుందని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. డీలి మిటేషన్‌తో ఉత్తరాది రాష్ట్రాల్లో 30శాతం సీట్లు పెరిగే అవకాశం ఉందని నివేదికలు తెలియజేస్తున్నాయన్నారు. దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ముఖ్యులంతా సమైక్యంగా పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. సహకార సమాఖ్యవాదం గురించి మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వం.. ప్రజలకు అవసరమైన పనులకోసం గ్రాంట్లలో ఎందు కు కోత పెడుతోందని నిలదీశారు. కర్ణాటకలో సహకార బ్యాంకుల కు నాబార్డు నిధుల్లో 58శాతం కోత విధించిందని, తద్వారా లక్షలాది రైతులకు ఈ ఏడాది పంటరుణాలు అందలేదని చెప్పారు.




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం దేశవ్యాప్తంగా పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలలో అత్యంత ముఖ్యమైనది.. దేశవ్యాప్తంగా కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు ఆమోదం తెలపడం. ఈ ప్రతిపాదనలో భాగంగా.. తెలంగాణ రాష్ట్రానికి నాలుగు (4) కొత్త కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేస్తూ కేంద్రం అదనపు చేయూతను అందించింది. ఈ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. తెలంగాణలో ఇప్పటికే ఉన్న 35 కేంద్రీయ విద్యాలయాలకు ఈ నాలుగు కొత్త పాఠశాలలు తోడవడంతో, రాష్ట్రంలో మొత్తం కేంద్రీయ విద్యాలయాల సంఖ్య 39కి చేరుకుంది. ఈ కొత్త విద్యాలయాలు ముఖ్యంగా వెనుకబడిన, మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. కొత్త కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు కానున్న ప్రాంతాలు, వాటి ప్రయోజనాలు ఇలా ఉన్నాయి. అందులో ఒకటి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం పరిధిలో ఉంది. ఇక్కడ కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక విద్యార్థులకు, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల వారికి మెరుగైన ప్రాథమిక, సెకండరీ స్థాయి విద్య అందుబాటులోకి వస్తుంది. మరొక కేంద్రం ములుగు జిల్లా పరిధలో ఏర్పాటు. ఇది గిరిజన ప్రాంతం కావడంతో.. ఇక్కడి విద్యార్థులకు కేంద్ర విద్యా ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన విద్య లభిస్తుంది. జగిత్యాల జిల్లా - చెల్గల్, వనపర్తి జిల్లా - నాగవరం శివార్ లో కూడా వీటిని ఏర్పాటు చేయనున్నారు.

# తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..

## 'పోలవరం-నల్లమల సాగర్' ప్రాజెక్టుపై సుప్రీంకోర్టుకు!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన విషయం తెలిసిందే. అయితే, ఆ లింక్ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించడంతో పాటు కేంద్ర జలశక్తికి ఫిర్యాదు చేసింది. దీంతో ఏపీ సర్కార్ పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు వెనక్కి తగ్గింది. అయితే, తాజాగా పోలవరం నీటిని బొల్లాపల్లి, నల్లమల సాగర్ జలాశయాలకు తరలించడమే లక్ష్యంగా పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు పేరును మార్చి పోలవరం-నల్లమల సాగర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఈ మేరకు ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి టెండర్లను ఇటీవల విడుదల చేసింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఏపీ సర్కారు నిర్మించ తలపెట్టిన పోలవరం-నల్లమల సాగర్ సాగునీటి ప్రాజెక్టుపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో అభ్యంతరాలు దాఖలు చేయాలని నిర్ణయించిందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కేసును వాదించాలని కోరినట్లుగా పేర్కొన్నారు. ఈ మేరకు రేపు మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో పోలవరం-బనకచర్ల సుప్రీంకోర్టు కేసుపై సన్నాహక సమావేశం జరుగనుంది. మధ్యాహ్నం 2.30కి అభిషేక్ మను సింఘ్వీతో ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ కానున్నారు.






## సీఎం రేవంత్‌రెడ్డితో అఖిలేష్ యాదవ్ భేటీ

హైదరాబాద్: నగరానికి వచ్చిన ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌ను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో అఖిలేష్ యాదవ్‌తో భేటీ అయ్యారు.

వివిధ రాష్ట్రాలు, జాతీయ స్థాయిలో రాజకీయ పరిస్థితులపై ఇరువురు చర్చించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అఖిలేష్‌కు రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## మెస్సీ వర్సెస్ రేవంత్ ఫుట్ బాల్ మ్యాచ్‌కి రాహుల్ గాంధీ..!

హైదరాబాద్: నగరంలో జరగబోయే 'మెస్సీ గోట్ ఇండియా టూర్' అనేది ఓ ప్రేవేట్ ఈవెంట్ అయినప్పటికీ రాహూల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ప్రత్యేకంగా హాజరు కావాల్సిందిగా కోరినట్లు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ బయలుదేరే ముందు ముఖ్యమంత్రి అక్కడి మీడియాతో మాట్లాడారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ ఫుట్ బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సీ ఈనెల 13న హైదరాబాద్ వస్తున్నారని.. ఓ ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని సీఎం చెప్పారు. ఈ కార్యక్రమానికి తననూ ప్రత్యేక అతిథిగా పిలిచారని.. అయితే ఇది ప్రభుత్వానికి సంబంధం లేని ఈవెంట్ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మెస్సీతోపాటు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్ వంటి అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొంటారు. అయితే, ఈ కార్యక్రమంలో మెస్సీ వర్సెర్స్ రేవంత్ రెడ్డి జట్లు 5 నిమిషాలపాటు మ్యాచ్ ఆడనున్నారు. మెస్సీతోపాటు ప్రముఖుల రాక నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే.. ఈ కార్యక్రమానికి సీనియర్ కాంగ్రెస్ నేత రాహూల్ గాంధీ వస్తున్నారా, లేదా? అన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పాసుల కోసం విఐపిలు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో మంచి డిమాండ్ ఏర్పడింది.




## ఆ ఎమ్మెల్యేలకు, టీ న్యూస్‌కు కవిత నోటీసులు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరో సంచలన పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వరరెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, టీ న్యూస్‌లకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇవాళ(శుక్రవారం) లీగల్ నోటీసులు పంపించారు. ఈ నోటీసులో పలు అంశాలను ప్రస్తావించారు. తనపై, తన భర్త అనిల్‌పై ఆధారాలు లేని ఆరోపణలు చేశారంటూ నోటీసులో తెలిపారు. వారం రోజుల్లో తనకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయం తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, తెలంగాణ జాగృతి జనం బాట పేరిట కవిత విస్తృతంగా పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ప్రజా సమస్యల పరిష్కరం కోసమే జనం బాట చేపట్టినట్లు కవిత ప్రకటించారు. మొదటగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జనం బాట కార్యక్రమం చేపట్టిన కవిత ఇప్పుడు మేడ్చల్, హైదరాబాద్ జిల్లాలో పర్యటిస్తున్నారు. నిన్న నగరంలోని మలక్‌పేట, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో పర్యటించారు కవిత. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను కవిత తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతలపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై షాకింగ్ కామెంట్స్ చేశారు కవిత. ఆమె చేసిన వ్యాఖ్యలకు మాధవరం కృష్ణారావు కూడా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆయనకు కవిత నోటీసులు పంపించినట్లు సమాచారం.

# ఘోర ప్రమాదం

## అదుపుతప్పి లోయలో పడిన బస్సు..

### అక్కడికక్కడే 9 మంది దుర్మరణం మరో ఐదుగురు పరిస్థితి విషమం



చింతూరు : అతివేగంతో ఓ ప్రైవేటు బస్సు అదుపుతప్పి లోయలో పడిన భయానక ఘటన ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇవాళ ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు జిల్లాకు చెందిన శ్రీ విఘ్నేశ్వర ట్రావెల్స్‌కు చెందిన బస్సు (AP 39 UM 6543) చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో రాజుగారి మెట్టు దగ్గర అదుపుతప్పి పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో మొత్తం 9 మంది మరణించగా మరో 20 మందికి పైగా గాయాలయ్యాయి. అందులో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లుగా తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఇద్దరు డ్రైవర్లతో పాటు 35 మందికిపైగా ప్రయాణికులు ఉన్నారు. భద్రాచలంలో దర్శనం పూర్తి చేసుకుని అన్నవరం వైపునకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్పాట్‌లో మరికొంతమంది ప్రయాణికులు తీవ్ర గాయాలతో హాహాకారాలు పెడుతున్నారు. స్థానికుల సమాచారం మేరకు స్పాట్‌కు చేరుకున్న పోలీసులు సహాయక చర్యలను ప్రారంభించారు.

రంపచోడవరం నుంచి ఇప్పటికే రెండు అంబులెన్స్‌లు ఘటనా స్థలానికి వచ్చాయి. ఈ మేరకు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. గాయపడిన వారంతా చిత్తూరు వాసులుగా గుర్తించారు. మృతులను చిత్తూరు జిల్లాకు చెందిన నాగేశ్వరరావు, తెనాలికి చెందిన శైలజారాణి, తిరుపతికి చెందిన శ్యామల, పలమనేరుకు చెందిన సునంద, శివశంకర్ రెడ్డి, బెంగళూరుకు చెందిన కృష్ణకుమారి, గిరింపేటకు చెందిన శ్రీకళ, చిత్తూరుకు చెందిన మధు, మురగంపేటకు చెందిన దొరబాబుగా గుర్తించారు.

**రాష్ట్రపతి, ప్రధాని సంతాపం...** అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50వేలు ఎక్స్ గ్రేషియాను ప్రధాని మోదీ ప్రకటించారు.

**సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి...** అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సు లోయలో పడి యాత్రికులు మృతి చెందడం బాధాకరమన్నారు. గాయపడినవారిని చింతూరు ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు ఆయనకు తెలిపారు. ఉన్నతాధికారులు తక్షణమే ఘటనాస్థలికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో బాధితులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.

**బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి లోకేశ్..** రోడ్డు ప్రమాదంపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బస్సు లోయలో పడి యాత్రికులు దుర్మరణం చెందడం బాధాకరమన్నారు. గాయపడిన వారికి అవసరమైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి: హోంమంత్రి అనిత...** రోడ్డు ప్రమాదంపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసుల నుంచి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

# సంపాదకీయం

## మమతది ధైర్యమా భయమా ?

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ హ్యాట్రిక్ సీఎం అన్నది తెలిసిందే. 2011 నుంచి ఆమె అధికారంలో కొనసాగుతున్నారు. బలమైన వామపక్షాల కోటను ఆమె కూల్చారు సీపీఎం వృద్ధ నేత జ్యోతీబసుతో తన రాజకీయ పోరాటం మొదలెట్టి ఆ తరువాత సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య తో దానిని తీవ్రతరం చేసి ఎట్టలేకకు కమ్యూనిస్టుల కోటలో తృణమూల్ రాజ్యాన్ని స్థాపించారు. అలా 2011లో తొలిసారి వచ్చిన మమతా బెనర్జీ పాతుకుని పోయారు. 2011 నాటికి బలంగా ఉన్న వామపక్షాలు మమతా దీదీని ఎదిరించి విపక్ష పాత్రలోకి వచ్చేశాయి. 2016 ఎన్నికల నాటికి ఆ బలం మరింతగా తగ్గిపోయింది. 2021 నాటికి బీజేపీ ధీటైన ప్రతిపక్షంగా మమత ముందు నిలిచింది. కమ్యూనిస్టులతో పోరు వేరు కమలంతో పోరు వేరు. ఈ సంగతి తెలిసేసరికి మమతా బెనర్జీకి హ్యాట్రిక్ సీఎం గడువు కూడా తీరిపోతోంది.

**సర్ తో చెక్ :** మమతా దీదీకి సర్ తో చెక్ చెప్పడానికి బీజేపీ సిద్ధంగా ఉంది. ఎక్కువగా అక్రమ వలసలతో వచ్చిన ఓట్లతో విపక్షాలు గెలుస్తున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. దాంతో బెంగాల్ లో సర్ ని కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తూంటే బీజేపీ బాహాటంగా మద్దతు ఇస్తోంది నిన్నటికి నిన్న పార్లమెంట్ లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా సర్ అంటే భయం ఎందుకని ప్రశ్నించారు. విపక్షాలు తీరుని తప్పు పట్టారు. ఇక బెంగాల్ లో చూస్తే కనుక బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ వలసదారులు తిరిగి వారి సొంత ప్రాంతాలకు వెళ్ళిపోతున్న దృశ్యాని వీడియోలు తీసి మరీ బీజేపీ సానుభూతిపరులు సోషల్ మీడియాలో చూపిస్తున్నారు దాంతో సర్ వల్ల ఏమి జరగబోతోంది అన్నది ప్రజలకు బీజేపీ అర్థం అయ్యేలా చేస్తోంది.

**ఐటీ వింగ్ లిస్ట్ అంటూ :** ఇదిలా ఉంటే బెంగాల్ లో సర్ ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న మమతా బెనర్జీ బీజేపీ మీద మండిపడుతున్నారు. బెంగాల్ బీహార్ కాదని ఆమె అంటున్నారు. ఏ ఒక్కరి ఓటు అయినా ఓటర్ల లిస్ట్ లో లేకపోయినా ఇంట్లో ఉన్న సామగ్రితో ఆడవారు అలాగే చేతికి అందిన దాంతో మగాళ్ళు బయటకు వచ్చి తిరగబడాలని ఆమె గట్టిగా కోరుకుంటున్నారు. ఆ విధంగా వారికి పిలుపు ఇస్తున్నారు. సర్ తో ఓటర్ల జాబితా కాదు అది బీజేపీ ఐటీ వింగ్ తయారు చేసిన లిస్ట్ అని కూడా మమత మండిపడుతోంది. మమత ఒక విధంగా ప్రజలతో కలసి సర్ ని వ్యతిరేకించాలని అనుకుంటున్నారు. అయితే ఎన్నికల వేళ ప్రజల నుంచి మద్దతు అందునా ఏకంగా పదిహేనేళ్ల పాటు అధికారంలో ఉన్న తృణమూల్ కి ఎలా వస్తుందో తెలియని పరిస్థితి అయితే లేదు అని అంటున్నారు.

**ఇవన్నీ సంకేతాలా :** ఈ మధ్యనే బెంగాల్ లో ఏకంగా అయిదున్నర లక్షల మందితో గీతా పారాయణం అనే భారీ యాగాన్ని నిర్వహించారు. కాషాయ జెండాల రెపరెపలతో అక్కడ హోరెత్తిపోయింది. మరో వైపు చూస్తే బెంగాల్ లో ఈసారి అధికారం మాదే అని బీజేపీ జబ్బలు చరుస్తోంది. ఇక తృణమూల్ పాలన మూడు టెర్ములు కావడంతో జనాలకు కూడా వ్యతిరేకత బాగా ఉందని అంటున్నారు. దీంతో పాటు బీజేపీ వేస్తున్న ఎత్తులు మమతా బెనర్జీ అండ్ కోకి గట్టి సవాల్ నే విసురుతున్నాయి. దాంతో మమతా బెనర్జీ ధైర్యంగా కనిపిస్తూ ప్రకటనలు ఇస్తున్నారా లేక భయంతో కూడిన తీరా అన్నది అయితే రాజకీయంగా చర్చకు వస్తోంది. నిజానికి ఎన్నికల్లో గెలిచే మాట ఉంటే బీజేపీ వంటి పార్టీ అక్కడ గెలవలేదు అనుకుంటే ధీమాగా ఉండవచ్చు కదా అని అంటున్నారు. ప్రత్యేకించి మమతా బెనర్జీ చేస్తున్న ప్రకటనలే ఏ ప్రీ పోల్ సర్వే అవసరం లేకుండా బెంగాల్ ఫలితాన్ని చెబుతున్నాయని కమలనాథులు సెటైర్లు వేస్తున్నారు.

# మున్నూరు కాపుల అభివృద్ధి నా లక్ష్యం

## : రాష్ట్ర మున్నూరు కాపు అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం రావు పటేల్



శామీర్ పేట, డిసెంబర్ 12( గరుడ వార్త) : కుల సంఘం బాధ్యతలు తనకు మరింత బాధ్యతను పెంచాయని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం రావు పటేల్, అఫెక్స్ కమిటీ కన్వీనర్ మీసాల చంద్రయ్య పటేల్ లు అన్నారు. శుక్రవారం అలియాబాద్ చౌరస్తాలోని శుభం గార్డెన్స్ లో మేడ్చల్ జిల్లా మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనం గౌరవ అధ్యక్షుడు మామిండ్ల శ్రీనివాస్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పుటం పురుషోత్తం రావు పటేల్, మీసాల చంద్రయ్య పటేల్ లు మాట్లాడుతూ అభిమానంతో సేవ చేసేవారికి పదవి ఇస్తే ఆ పదవికి వన్నె తెస్తారని, పదవి అంటే హోదా కాదు బాధ్యత అన్నారు. మున్నూరు కాపులను ఏకతాటి పైకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ మల్క కొమురయ్య పటేల్ మాట్లాడుతూ మున్నూరు కాపు లందరూ ఏకాతాటి పై కి వచ్చి అందరి ఆమోదం తో ఏకగ్రీవంగా అధ్యక్షుణ్ణి ఎన్నుకోవడం మున్నూరుకాపుల ఐక్యతకు నిదర్శనమన్నారు.

ప్రస్తుతం బిసి మూమెంట్ నడుస్తుందని, అందరిని కలుపుకుని అవగాహనా కల్పిస్తూ రాజ్యాధికారం దిశగా ముందుకెళ్లాలని తెలిపారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకోగా అధ్యక్షునిగా వేల్పుల శ్రీనివాస్ పటేల్, ప్రధాన కార్యదర్శి గా చాట్లపల్లి నర్సింగ్ రావు, ఉపాధ్యక్షుడు గా పాదం వెంకటేశ్వర్లు పటేల్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మామిండ్ల



శ్రీనివాస్ పటేల్ ను వేదిక సాక్షిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా అదేవిదంగా రంగారెడ్డి జిల్లా ఎన్నికల ఇంచార్జిగా రాష్ట్ర అధ్యక్షుడు నియమించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్ పటేల్, రాష్ట్ర మహిళా కమిటీ అధ్యక్షురాలు బండి పద్మ పటేల్, కాంగ్రెస్ రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షుడు తూము వినయ్ పటేల్, బిజెపి రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షులు దివాకర్ పటేల్, పోతం వెంకటేశ్వర్లు పటేల్, ఇంద్రజాలకుడు సామల వేణు పటేల్, మున్నూరు కాపు సంఘం నాయకులు పర్వతం సతీష్ పటేల్, గౌని శ్రీనివాస్ పటేల్, బుద్ది సత్తయ్య పటేల్, ముత్యాల రాజశేఖర్ పటేల్, ఆకుల సత్యనారాయణ పటేల్, బల్లెపుల చంద్రశేఖర్ పటేల్, ఆకుల సురేష్ పటేల్, ఇందూరి తిరుపతి పటేల్, కర్ర వెంకన్న పటేల్, యంజాల పద్మయ్య పటేల్, చిందం మహేందర్ పటేల్, తోట నరేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్ గురుకుల పాఠశాలను గాలికి వదిలేశారు : బిఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్



శామీర్ పేట, డిసెంబర్ 12( గరుడ వార్త ) : రాష్ట్ర బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్ గురుకుల పాఠశాలను గాలికి వదిలేశారని బిఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఆరోపించారు. శామీర్ పేట బీసీ గురుకుల విద్యార్థుల సమస్యలపైన పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తే అధికారులు పట్టించుకోలేదని బిఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం శుక్రవారం సందర్శించారు.

ఈ సందర్భంగా టిల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్ గురుకుల పాఠశాలను గాలికి వదిలేశారన్నారు. గురుకుల పాఠశాలల సమస్యలపైన సమీక్ష నిర్వహించకపోవడం వలన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తాం మని హెచ్చరించారు.

కాగా బీసీ గురుకుల సొసైటీ జాయింట్ సెక్రటరీ మద్దిలేటి, శామీర్ పేట పోలీస్ లు గురుకుల పాఠశాల వద్దకు రాగా విద్యార్థుల సమస్యలు పరిశీలించాలని కోరి ఎప్పటికీ మద్దిలేటి పట్టించుకోకపోవడంతో టిఆర్ఎస్వి ఆధ్వర్యం లో గురుకుల పాఠశాలముందు ధర్నా చేశారు. దీంతో పోలీసులు టిఆర్ఎస్వి కార్యకర్తలను అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ ఛైర్మెన్ మధుకర్ రెడ్డి, విద్యార్థి నాయకులు యశ్వంత్ గుప్తా, బత్తిని ప్రశాంత్ గౌడ్, విశాల్, యాద క్రాంతి, నితీష్, చంద్రకాంత్, షోయబ్, అబీ ముదిరాజ్, ఆనంద్, కరణ్ తదితరులు పాల్గొన్నారు.


## బైకును లారీ ఢీకొనడం ఓ వ్యక్తి మృతి

శామీర్ పేట, డిసెంబర్ 12 ( గరుడ వార్త) : బైకును లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీస్ లు తెలిపిన విరాల ప్రకారం శామీర్ పేట వల్లపు శ్రీనివాస్ (52) రాయి పని చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం 6.15 గంటల సమయంలో శామీర్ పేట వైపు నుంచి పెద్దమ్మ కాలనీ వైపు తన గ్లామర్ బైక్ నంబర్ టి ఎస్ 08 ఎఫ్ ఎస్ 5739 పై వెళ్తుండగా మార్గమధ్యంలోని అరణ్య రిసార్ట్ సమీపంలోకి రాగానే అశోక్ లేలాండ్ గూడ్స్ క్యారియర్ వాహనం నంబర్ టి ఎస్ 07 యు ఎల్ 2176 పెద్దమ్మ కాలనీ నుంచి శామీర్ పేట వైపు అతి వేగంగా, నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి శ్రీనివాస్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్ రోడ్డుపై పడి తలకు తీవ్ర రక్తస్రావ గాయాలు, శరీరంలోని ఇతర భాగాలకు గాయాలు అయ్యి అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాస్ మృతదేహానికి పోలీసులు పంచనామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాడు.



# జేఎన్టీయూలో కీచక ప్రొఫెసర్.. గెస్ట్ ఫ్యాకల్టీపై పలుమార్లు

హైదరాబాద్, డిసెంబర్ 12: నగరంలోని జేఎన్టీయూలో దారుణం చోటు చేసుకుంది. గెస్ట్ ఫ్యాకల్టీపై ప్రొఫెసర్ లైంగిక దాడి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒకే సామాజిక వర్గం అంటూ నమ్మించి మరీ బాధితురాలిని ప్రొఫెసర్ వంచించాడు. ఉద్యోగం నుంచి తీసేస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతూ.. భయపెడుతూ పలుమార్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలుస్తోంది. చివరకు బాధితురాలి కాపురాన్ని కూడా కూల్చేశాడు కీచక ప్రొఫెసర్. వర్క్ ఉందంటూ బాధితురాలిని అర్ధరాత్రి వరకు తనతోనే ఉంచుకున్నాడు ప్రొఫెసర్. దీంతో భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో బాధితురాలు ఒంటరిగా ఉంటోంది. అంతేకాకుండా ఆమె ఒంటరితనాన్ని అవకాశంగా మలుచుకుని శారీరకంగా, మానసికంగా ప్రొఫెసర్ మరింతగా వేధింపులకు గురిచేశాడు. తన ఛాంబర్‌లో కూడా బాధితురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. రోజు రోజుకు ప్రొఫెసర్ వేధింపులు అధికమవడంతో బాధితురాలు తీవ్ర మానసిక వేదనకు గురైంది. ప్రొఫెసర్ వేధింపులు భరించలేక పోలీసులను



ఆశ్రయించింది. దీంతో నిందితుడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రముఖ విశ్వ విద్యాలయంలో జరిగిన ఈ ఘటనపై విద్యార్థులు, ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ఆసుపత్రికి ఆలస్యం జబ్బు

నిజామాబాద్: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిస్థితి తయారైంది. భవన మరమ్మతులు, నూతన పైప్‌లైన్‌కు నిధులు మంజూరైనా పనులు చేపట్టడంలో నెలల తరబడి జాప్యం జరుగుతోంది. ఏడంతస్తుల జీజీహెచ్‌లో మరుగుదొడ్లు, మూత్రశాలల పైపులు పగిలాయి. లీకైన నీరు గోడల మీదుగా పారుతోంది. ఈ నేపథ్యంలో మరమ్మతులకు ప్రభుత్వం రూ.2.75 కోట్లను 3 నెలల క్రితం మంజూరు చేసింది.

**తల్లీ బిడ్డలకు కష్టాలే..**

జీజీహెచ్‌లో రోజుకు ఓపీ 1,500–2,000 నమోదవుతోంది. ప్రతీ నెలా 500 ప్రసవాలు జరుగుతున్నాయి. తల్లీబిడ్డల వార్డు ప్రస్తుతం మొదటి అంతస్తులో కొనసాగిస్తున్నారు. వీరికోసం పక్కనే రూ.40 కోట్లతో మాతా, శిశు సంరక్షణ కేంద్రాన్ని (ఎంసీహెచ్) నిర్మించారు. ఏడాదిగా అది అలంకారప్రాయంగా ఉంది. అక్కడకు మాతా శిశు విభాగం తరలింపులో జాప్యం జరుగుతోంది. ఎప్పుడు అధికారులను అడిగినా.. 'వారం, పది రోజుల్లోనే' తరలిస్తాం అంటున్నారు.

**అక్కరకు రాని క్యాథ్‌ల్యాబ్**

రూ. 7 కోట్ల వ్యయంతో క్యాథ్‌ల్యాబ్, యంత్రాలు రెండేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. కార్డియాలజిస్ట్ లేకపోవడంతో క్యాథ్‌ల్యాబ్ సేవలు అందుబాటులోకి రాలేదు. హృద్రోగులకు సేవలు దరిచేరడం లేదు.



ఈ విభాగంలో 120–150 ఓపీ నమోదవుతుండగా.. చాలామంది ప్రైవేటు దవాఖానాలకు వెళ్లి జేబులు గుల్లచేసుకోవాల్సి వస్తోంది.

**'ప్రైవేటు'కు సహకరించేందుకేనా...**

ప్రస్తుతం జీజీహెచ్‌లోని మాతా, శిశు వార్డుకు వైద్య సిబ్బంది ఎవరు వస్తున్నారో, ఎప్పుడు వెళ్తున్నారో తెలియని పరిస్థితి. ఎంసీహెచ్‌ను ప్రారంభిస్తే అక్కడ కచ్చితంగా అందుబాటులో ఉండాలి. ఇక్కడ ప్రసవాలు పెరిగితే ప్రైవేటు దవాఖానాలకు తాకిడి తగ్గుతుంది. జీజీహెచ్‌లో పనిచేసే చాలామంది వైద్యులు ప్రైవేటులో ప్రాక్టీస్ చేసేవారే. ఈ కారణంగానే ఎంసీహెచ్ ప్రారంభం, ఆసుపత్రి మరమ్మతుల అంశాన్ని కొందరు దాటవేస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు.'వారం రోజుల్లో మాతా శిశు విభాగాన్ని కొత్త భవనంలో పూర్తిస్థాయిలో తరలిస్తాం. అక్కడే సేవలన్నీ అందిస్తాం. ఆసుపత్రిలో మరమ్మతులు, పైప్‌లైన్ పనుల్ని త్వరలోనే పూర్తిచేయిస్తాం' అని జీజీహెచ్ పర్యవేక్షకులు శ్రీనివాస్ అన్నారు.

# వారంతే.. అన్నదాతకు చింతే..!

తుంగతుర్తి : ప్రభుత్వ హామీ: రైతులు ఆందోళన చెందొద్దు. ధాన్యం తడిసినా..మొల కెత్తినా..ఆరిన తర్వాత 16 శాతం తేమ వస్తే కొనుగోలు చేస్తాం.మిల్లర్ల కొర్రీలు: తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి తేమ వచ్చిన తర్వాత ధాన్యం కాంటా వేయించి బస్తాలను లారీలో మిల్లుకు పంపించాక.. యజమానులు కొర్రీలు పెడుతూ తిప్పి పంపుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ మేం సీతయ్యలం.. ఎవరి మాటా వినం.. ధాన్యం దిగుమతి చేయమంతే.. అన్నట్లు కొందరు మిల్లర్లు వ్యవహరిస్తున్న తీరు అన్నదాతలను కన్నీరు పెట్టిస్తోంది. నారు పోసింది మొదలు ధాన్యం అమ్ముకునే వరకు రైతులకు కష్టాలు అన్నీఇన్నీ కావు. నాటువేసే దశలో నీటి కొరత.. ఆపై యూరియా కోసం బారులు..తీరా పంట చేతికందే సమయంలో నీట ముంచిన భారీ వర్షాలు.. ఇలా అన్ని విపత్తులను తట్టుకుని కొనుగోలు కేంద్రాల్లో పోసిన తర్వాత మొంథా తుపానుతో ధాన్యం తడిసి ముద్దయింది. వాటిని ఆరబెట్టేందుకు రెట్టింపు కష్టాలు పడ్డారు. ఇలా తుంగతుర్తి మండలంలోని ఓ కేంద్రంలో 16 శాతం తేమ వచ్చాక కేంద్రం నిర్వాహకులు ధాన్యాన్ని కాంటా వేసి లారీలో తిరుమలగిరిలోని ఓ మిల్లుకు పంపారు. ఒకటీ రెండూ కాదు...ఆరు రోజులు దాటినా బస్తాలను దిగుమతి చేసుకోలేదు.



కారణమడిగితే ధాన్యం నల్లబడింది.. దిగుమతి చేసుకోం. మీరు ఎవరికైనా చెప్పుకోండని లారీని తిరిగి కేంద్రానికి పంపారు.

దీంతో నిర్వాహకులు చేసేది లేక ఆ లారీలోని 720 బస్తాలకు సంబంధించిన ఆరుగురి రైతులను పిలిపించారు. ఆ బస్తాలను మార్చేందుకు అదనంగా మూడు లారీలను తెప్పించి ఒక్కో బస్తా పరిశీలించారు. వాటిలో కేవలం 80 బస్తాల్లో మాత్రమే కొద్దిగా గింజ నల్లబడింది. కానీ లోపల బియ్యం తెల్లగా ఉండటాన్ని గుర్తించారు. మిల్లరు ధాన్యాన్ని ఎందుకు వెనక్కి పంపారో అర్థం కాలేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

నిర్వాహకులు తమకు సమాచారం ఇస్తే మిల్లరుతో మాట్లాడి దిగుమతి చేయించేవారమని ఐకేపీ ఏపీఎం అశోక్ చెప్పారు.

## సన్నద్ధతలో ఎలాగోలా 'నెట్టు'కొస్తూ..

నిజామాబాద్ : ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటనల నేపథ్యంలో జిల్లాలోని పఠనాలయాలకు అభ్యర్థులు వందల సంఖ్యలో తరలివస్తున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం, పాత డీఈవో కార్యాలయంలో నిరుద్యోగ యువకులు పుస్తకాలతో కుస్తీపడుతూ కనిపిస్తున్నారు. ఉద్యోగార్థులకు ఆన్‌లైన్ దరఖాస్తు, నోటిఫికేషన్ల సమాచారం, విషయ పరిజ్ఞాన సేకరణకు ఇంటర్నెట్ ఎంతో అవసరం. అందరికీ స్మార్ట్‌ఫోన్లు ఉన్నందున ఉచిత వైఫై సదుపాయం ఉపయోగపడుతుంది. వందలాది మంది వచ్చే జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కంప్యూటర్లు, వైఫై రూటర్లు ఉన్నా.. డేటా స్పీడ్ మరింత పెంచాలి. ఇతర శాఖా గ్రంథాలయాల్లోనూ ఈ సదుపాయం కల్పించాలి. అన్ని చోట్ల అంతర్జాల వసతి అవసరం

కేంద్ర గ్రంథాలయంతో పాటు శాఖా, గ్రామీణ గ్రంథాలయాలు జిల్లాలో కొనసాగుతున్నాయి. వీటిలో జిల్లా కేంద్ర గ్రంథాలయం, బోధన్, ఆర్మూర్‌లో ఇంటర్నెట్ (కంప్యూటర్లతో), వైఫై సదుపాయం, బాల్కొండ, భీమ్‌గల్, మోర్తాడ్, వర్ని, ధర్పల్లి పఠనాలయాల్లో కేవలం వైఫై (రూటర్) వసతి ఉంది. నిజామాబాద్‌లో రూ.10 లక్షలు, బోధన్‌లో రూ.3 లక్షలు, ఆర్మూర్‌లో రూ.3 లక్షలతో కంప్యూటరు విభాగాలు, రూటర్లు ఏర్పాటు చేయించారు.

## ఇళ్లకు ఇసుక తిప్పలు

సూర్యాపేట : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఇసుక కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పథకం జిల్లాలో అమలు కావడం లేదు. లబ్ధిదారులకు సమాచారం అందించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. జిల్లాలో 8,112 మందికి ఇందిరమ్మ ప్రొసీడింగ్‌లు అందించగా.. ఇప్పటి వరకు 6,892 మంది ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఒకేసారి పెద్ద మొత్తంలో నిర్మాణం ప్రారంభించడంతో ఇసుక కూడా అంతే మొత్తం అవసరం పడుతోంది. వీరితో పాటు ఇతరులు కూడా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. లబ్ధిదారుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని, దూరభారాన్నిబట్టి ట్రాక్టర్ ఇసుకకు రూ. 6500 నుంచి రూ. 8 వేల వరకు వసూలు చేస్తున్నారు. మరీ అత్యవసరమైతే రూ. 10 వేలు తీసుకున్న దాఖలాలు కూడా ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత తీర్చేందుకు మండలానికి ఓ ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు. ఆ దిశగా అడుగులు పడటం లేదు. ప్రస్తుతం జాజిరెడ్డిగూడెం, అర్వపల్లి, నాగారం, టేకుమట్ల నుంచి సరఫరా అవుతోంది. మిగతా ప్రాంతాల్లో తక్కువ ధరకు సరఫరా చేస్తున్నా...గోడల నిర్మాణానికి అది ఉపయోగ పడటం లేదని లబ్ధిదారులు చెబుతున్నారు.

సూర్యాపేటకు చెందిన ఓ లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. రెండు నెలల క్రితం ఇంటి పనులను మొదలుపెట్టగా ప్రస్తుతం గోడల



వరకు పూర్తయింది. ఇప్పటి వరకు ట్రాక్టరుతో అయిదు ట్రిప్పుల ఇసుకను తోలించాడు. మొదట్లో కొరత పేరుతో ట్రిప్పునకు రూ. 8 వేలు వెచ్చించాడు. ప్రస్తుతం సులువుగా లభిస్తుండటంతో రూ. 6 వేల చొప్పున తోలిస్తున్నాడు. ఇప్పటి వరకు ఇసుకకే రూ. 40 వేలు ఖర్చు చేశాడు. నిరీ?త స్థలంలో ఒక్కో ఇంటి నిర్మాణానికి 35 మెట్రిక్ టన్నుల ఇసుక పరిమాణం అవసరమని అధికారులు అంచనా వేశారు. అందుకోసం ఒక్కో ఇంటికి పునాది, పిల్లర్లు, స్లాబు, గోడల నిర్మాణ దశల్లో ఎనిమిది ట్రాక్టర్ల ఇసుక సరఫరా చేయాలని నిర?యించారు. రీచ్‌ల వద్ద సొసైటీలకు నిరీ?త రుసుము, కిలో మీటరుకు రూ. 5 చొప్పున లబ్ధిదారులే భరించాల్సి ఉంటుంది. ఉచిత ఇసుక కోసం మన ఇసుక-మన వాహనం యాప్‌లో ఆన్‌లైన్‌లో బుక్ చేయడం లేదా గృహ నిర్మాణ శాఖ ఏఈలకు ఇండెంట్ ద్వారా నిరీ?త సమయంలో ఇసుక సరఫరా అవుతుందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఇళ్ల మంజూరు : 8112
పనులు ప్రారంభం: 4273
పునాదుల దశలో: 1980
ప్రహరీ: 762
స్లాబు: 924
పూర్తయ్యింది: 154

## వచ్చే సారథులు.. ఇదిగో వనరులు

రాజపేట : గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి జోరందుకుంది. మొదటి విడత ప్రచారం ముగియగా.. రెండు, మూడో విడతల్లో జరిగే ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమదైన శైలిలో ప్రచారం ముమ్మరం చేశారు. మరి కొద్ది రోజుల్లో పంచాయతీలకు నూతన పాలకవర్గాలు కొలువుదీరనున్నాయి. విజేతలైన వారికి పంచాయతీలకు అందుబాటులో ఉండే ఆర్థిక వనరులు ఏమిటో తెలుసుకోవాలనే ఆసక్తి ఉండటం సహజం. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులే ప్రధానం. వీటితో పాటు సొంతంగా సేకరించే సాధారణ నిధులతో గ్రామాభివృద్ధికి అవకాశం ఉంటుంది.

**కేంద్ర ఆర్థిక సంఘం**

పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన నిధులు మంజూరు చేస్తుంది. గ్రామ పంచాయతీలోని ఒక్కో వ్యక్తికి నెలకు రూ. 80 నుంచి రూ. 90 చొప్పున కేటాయిస్తుంది. ప్రతి మూడు మాసాలకు ఒకసారి, ఏడాదిలో నాలుగు విడతలుగా నిధులను అందజేస్తుంది.

**రాష్ట్ర ఆర్థిక సంఘం**

రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు సైతం క్రమం తప్పకుండా మంజూరు చేయాల్సి ఉంటుంది. ఇవి కూడా పంచాయతీలోని జనాభా



ప్రాతిపదికన ఇస్తారు. కొన్నాళ్లుగా ఇవి విడుదల కావడం లేదు. దీనికి బదులుగా రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు, విద్యుత్తు బిల్లులు చెల్లిస్తుండటం గమనార్హం.

**ఉపాధిహామీ పథకం ద్వారా**

గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన ఉపాధిహామీ పనుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారు. కూలీలు చేసే పనులకు 60 శాతం, మరో 40 శాతం నిధులు మెటీరియల్ కాంపోనెంట్ కింద మంజూరు చేస్తారు. వీటితో గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, ఇంకుడుగుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు.

**సాధారణ నిధులు**

గ్రామ పంచాయతీలు సొంతంగా సమకూర్చుకునే వాటిని సాధారణ నిధులకింద గుర్తిస్తారు. ఈ నిధులు పెంచుకోవడానికి పంచాయతీలు ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేయాల్సి ఉంటుంది.

**జిల్లా సమాచారం..**

మొత్తం గ్రామ పంచాయతీలు : 427
వార్డుల సంఖ్య : 3704
మొత్తం ఓటర్లు : 5,32,240
మొదటి విడత ఎన్నికలు జరిగే మండలాలు : ఆలేరు, రాజపేట, యాదగిరిగుట్ట, ఆత్మకూర్(ఎం) బొమ్మలరామారం, తుర్కపల్లి

## గిరిజన గ్రామం.. అన్నింటా ఆదర్శం



ధర్మపురి : గొడవలు, వివాదాలు, ఘర్షణలు తెలియని పల్లె అది. శాంతి, సమష్టి జీవనానికి ప్రతీకగా నిలుస్తోంది. వందశాతం గిరిజన గ్రామమైన ఆకుసాయిపల్లెలో ఇంత వరకు ఒక్క కేసు నమోదు కాలేదు. ప్రతీసారి ఎన్నికల్లో 90 శాతానికిపైగా ఓటింగ్ నమోదవుతోంది. పార్లమెంట్, శాసనసభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్‌లోనూ ఉత్సాహంగా పాల్గొంటారిక్కడి జనం.


ఈ పల్లెలో అందరూ శాంతి సామరస్యాలతో అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవిస్తున్నారు. కష్టసుఖాల్లో ఒకరికి మరొకరు తోడుగా నిలుస్తున్నారు. ఏ ఇంటిలో ఏ చిన్న వివాదమైనా వారికి వారే పరిష్కరించుకుంటున్నారు. ప్రతీ ఎన్నికల్లో ఓటు వేసిన తర్వాతనే పొలం బాట పడుతున్నారు. వాహనాలు, ఎడ్లబండ్లు ఏర్పాటు చేసుకుని స్వఛ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్నారు.

**పథకాల్లోనూ భేష్**

ఈ పల్లెలో 7 స్వశక్తి సంఘాలుండగా రూ. 20 లక్షల రుణాలను పొంది వాటిని సమృద్ధిగా వాడుకుంటూ సంఘం పటిష్టతకు కృషి చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులుండగా ప్రతిరోజు పిల్లల్ని పాఠశాలకు పంపిస్తున్నారు. పల్లె ప్రగతి కార్యక్రమాన్ని వందశాతం విజయవంతంగా నిర్వహించారు. నాటిన మొక్కల్ని పెంచడంతోపాటు పల్లె ప్రకృతివనాన్ని అభివృద్ధి చేశారు. పదేళ్ల కిందట సదుపాయాలు లేని ఈ పల్లెలో రహదారులు, విద్యుత్తు, సీసీరోడ్లు, మురుగుకాలువలు, తాగునీటి సరఫరా, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసుకున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో 95 శాతం, పార్లమెంట్ ఎన్నికల్లో 97 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గ్రామం : ఆకుసాయిపల్లె
జనాభా : 468
ఓటర్లు : 276
అక్షరాస్యత : 25 శాతం

## రాత.. మార్చలేరు ఇక!



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నల్లా వివరాలకు సంబంధించిన రిజిస్టర్లను డిజిటలైజేషన్ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏళ్ల తరబడి ఉన్న వివరాలను పక్కాగా భద్రపర్చేందుకు ఆంతర్జాలంలో నిక్షిప్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు చేతి రాతతో ఉండటంతో పేర్లు, ఇంటినంబర్లు, నల్లా వివరాలు సులువుగా మార్చుకునే వీలుండేది. కొన్ని సందరాల్లో అక్రమాలకు తావిచ్చేలా మార్పులకు అవకాశముండేది. ప్రస్తుతం ఈ వివరాలన్నీ స్కానింగ్ చేసి కంప్యూటీకరణ చేస్తుండటంతో ఆ సమస్యలన్నీ దూరం కానున్నాయి. అయిదేళ్ల కిందట స్టోర్ రూంలో ఉన్న దస్త్రాలను డిజిటల్ చేశారు. 2020 నవంబరు నుంచి ఆన్‌లైన్‌లో నల్లా కనెక్షన్లు ఇస్తుండగా, అంతకుముందు నుంచి ఉన్న వివరాలన్నీ పుస్తకాల్లో రాసి ఉన్నాయి. 1970 నుంచి ఈ రిజిస్టర్లు ఉండటంతో పేజీలన్నీ ఒక్కొక్కటిగా చినిగిపోతున్నాయి. మొత్తం 29 రిజిస్టర్లు ఉండగా అందులో సుమారు 43 వేల నల్లా కనెక్షన్ల వివరాలు ఉన్నాయి. ఒక్కోదానిలో 2 వేల కనెక్షన్ల వివరాలు ఉన్నట్లు తెలుస్తోంది. పేరు, చిరునామా, ఏరకమైన నల్లా కనెక్షన్, ప్రతినెలా ఎంత కడుతున్నారు. బకాయిల వివరాలు, చెల్లించిన బిల్లుల రసీదు నంబర్లతో వివరాలు ఉన్నాయి.

**సర్వేలో తకరారు**

నగరవ్యాప్తంగా నల్లా కనెక్షన్లకు సంబంధించిన సర్వే చేస్తున్నారు. ఇందులో భాగంగా నివాసితం, వాణిజ్య నల్లాల విషయంలో తకరారు వస్తోంది. పాత ఇల్లు ఉన్న సమయంలో నివాసితం కింద ఉన్న నల్లా కనెక్షన్ ప్రస్తుతం వాణిజ్య భవనం నిర్మించి అలాగే ఉంటుంది. వాణిజ్య నల్లా కనెక్షన్ లేకపోవడంతో రెడ్ నోటీసులు ఇస్తుండటంతో ఇంటి యజమానులతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటికి సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే బల్దియాలో ఉన్న రిజిస్టర్ చినిగిపోయి పేజీలు దొరకని పరిస్థితి నెలకొంది. ఒక పుస్తకం కూడా దొరకడం లేదంటున్నారు. గందరగోళం లేకుండా ఉన్న వివరాలన్నీ డిజిటలైజేషన్ చేసి సమాచారాన్ని భద్రంగా ఉంచాలని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశాల మేరకు నీటి విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు స్కానింగ్ చేసే పనులు జరుగుతున్నాయి.

## 'తట్టు'కోలేక పోతున్నాం



హైదరాబాద్ : మహానగర ప్రజలకు తాగునీటిని అందిస్తున్న హిమాయత్‌సాగర్‌లో చెత్త, దుమ్ము, ధూళి క్రమంగా నిండుతోంది. పరిసరాల్లోని ఫంక్షన్‌హాళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యాలు విసిరేస్తున్న చెత్త, రెడీమిక్స్ కాంక్రీట్ వాహనాల కారణంగా ధూళి తెట్టులా నీటిపై పరుచు కుంటోంది. జలమండలి స్పందించడం లేదు. పరీవాహక ప్రాంతం నుంచి 10 కి.మీ. వరకూ ఎలాంటి లేఅవుట్లు ఉండకూడదన్న నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయి. అనుమతి లేని రెడీమిక్స్ కాంక్రీట్, క్రషర్ల ప్లాంట్లున్నా పీసీబీ కళ్లు మూసుకుంది.

**రోజంతా భారీ వాహనాలు..**

హిమాయత్‌సాగర్ పరిసర ప్రాంతాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్న రెడీమిక్స్ ప్లాంట్ల కారణంగా రాజేంద్రనగర్ నుంచి శంషాబాద్ రహదారిపై రోజంతా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. సిమెంట్, కంకరను తీసుకెళ్లేప్పుడు, కాంక్రీట్‌ను తీసుకువచ్చేప్పుడు దుమ్ము, ధూళి హిమాయత్‌సాగర్‌లోకి వెళ్తోంది. సాగర్ పరిసర ప్రాంతాల్లో కొండలు, గుట్టలతో నిండిన భూములను కొందరికి క్రషర్ ప్లాంట్ల నిర్వహణకు లీజుకు ఇచ్చినా ఈ భూములు ఔటర్ మధ్యలో ఉండడంతో ప్రభుత్వం రద్దు చేసింది. రాజకీయ పలుకుబడితో కొందరు వాటిని నిర్వహిస్తుండటం గమనార్హం. **రోడ్లు దెబ్బతింటున్నాయ్.. జలచరాలు చనిపోతున్నాయ్..** రెడీమిక్స్ పాంట్ల కార్యకలాపాలతో కొత్వాల్‌గూడ, శంషాబాద్ రోడ్లు దెబ్బతింటున్నాయి. భారీ వాహనాల బరువుకు కుంగిపోతోంది. హిమాయత్‌సాగర్ సమీపంలో కొన్నిచోట్ల కోసుకుపోయింది. టిప్పర్లు, కాంక్రీట్ లారీల వేగంతో ప్రమాదాలూ పెరుగుతున్నాయి. అక్కడ ఓ ఫంక్షన్‌హాల్ నిర్వాహకులు ఆహార వ్యర్థాలను పారేయడంతోపాటు మురుగును పైపు ద్వారా సాగర్‌లోకి వదులుతుండటంతో జలచరాలు చనిపోతున్నాయి.

## కుక్క కాటుకు టీకా దెబ్బ

హైదరాబాద్: నారాయణగూడ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం), నల్లకుంట ఫీవర్ ఆసుపత్రులు కుక్కకాటుకు టీకా అందించడంలో ముందుంటున్నాయి. ఐపీఎంకు సరాసరి 80-100 వరకు, ఫీవర్ ఆసుపత్రికి సరాసరి వంద మంది వరకు సంప్రదిస్తున్నారు. వేసవిలో రెట్టింపు సంఖ్యలో బాధితులు ఉంటున్నారు. బాధితుల్లో అధిక శాతం పిల్లలు, వృద్ధులు, మహిళలు ఉంటున్నారు. అవగాహన లేక రేబిస్ మరణాలుకుక్క కరిస్తే టీకా తీసుకోవాలనే అవగాహన లేకపోవడం.. చిన్న గాటే కదా అని నిర్లక్ష్యంగా ఉండటం వల్ల రేబిస్ మరణాలు చోటు చేసుకుంటున్నాయి. 2 నెలల్లో ఏడుగురు వరకు రేబిస్‌తో నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో చేరారు. అక్టోబరులో నలుగురు, నవంబరులో ముగ్గురు ఫీవర్ ఆసుపత్రిలో చేరారు. రేబిస్ సోకితే బతకడం కష్టం. అందుకే కుక్క కరిచిన చోట చిన్న గాయమైనా ధారగా నీళ్లు పోసి కడిగిన తర్వాత వెంటనే టీకా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పెద్దగాయమైతే టీకాతోపాటు గాయమైన చోట ఇమ్యూనో గ్లోబలిన్ ఇంజక్షన్ కూడా చేస్తారు. గర్భిణులు, బాలింతలకూ వ్యాక్సిన్‌గర్భిణులు, బాలింతలు వెంటనే వైద్యులను సంప్రదించి టీకా తీసుకోవాలి. లేదంటే గర్భిణితోపాటు కడుపులో బిడ్డకూ ప్రమాదమేనని గుర్తించాలి. సొంత వైద్యం, నాటు మందులొద్దు. పెంపుడు కుక్కలు, పిల్లులు కరిచినా.. రక్కినా.. నిర్లక్ష్యం చేయొద్దు. వాటికీ వ్యాక్సిన్లు వేయించాలి.

## ఆటంకాలే..!

ఆత్మకూరు : గ్రామీణ ప్రాంత యువత, విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు, క్రీడలను సాధన చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని 421 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ నిధులతో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ప్రతి ప్రాంగణంలో కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్ బాల్, కోర్టులు, వ్యాయామం చేయడానికి తగిన సామగ్రి, ఆర్చ్‌లు ఏర్పాటు చేయాలని, చుట్టూ మొక్కలు నాటాలని నిరయించారు.

అన్ని రకాల వసతులు ఉండేలా స్థలాలను ఎంపిక చేయాల్సి ఉండగా.. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఉంది. గ్రామాలకు దూరంగా, బండలు, చెరువులు, కుంటల సమీపంలో ప్రభుత్వ స్థలాలను గుర్తించి చదును చేసి బోర్డులు పాతి చేతులు దులుపుకున్నారని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. చాలాచోట్ల పాఠశాల ఆవరణలోనే క్రీడా ప్రాంగణాల బోర్డులను ఏర్పాటు చేశారు.

ఆటలు ఆడేందుకు క్రీడా ప్రాంగణాలు అనువుగా లేకపోవడం, సామగ్రి అందించకపోవడంతో యువత, విద్యార్థులు ప్రాంగణాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. పలుచోట్ల బండలు, చెట్లపొదల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయడంతో విమర్శలు మిన్నంటాయి. ప్రాంగణాల్లో ముళ్ల చెట్లు పెరిగాయి. పలు గ్రామాల్లో ఈ ప్రాంగణాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వినియోగిస్తున్నారు.

ప్రతి క్రీడా ప్రాంగణానికి క్రికెట్ బ్యాట్లు, బాల్స్, వాలీబాల్స్,




టెన్నీకాయిట్ రింగులు, స్కిప్పింగ్ రోప్స్, డంబెల్స్, డిస్కస్‌త్రో, కొలతల టేపులు, తదితర 23 రకాల ఆట పరికరాలు, బ్యాగులను గ్రామ పంచాయతీలకు అప్పట్లో అందించారు. ప్రాంగణాలు వినియోగంలోకి రాకపోవడతో చాలా చోట్ల కిట్లు అట్టకెక్కగా, కొన్నిచోట్ల ఎక్కడున్నాయో తెలియని దుస్థితి నెలకొంది.

**అందుబాటులోకి తేవాలి:** గడ్డం సతీశ్, కబడ్డీ రాష్ట్ర స్థాయి క్రీడాకారుడు, ఆత్మకూరు(ఎం)

గ్రామాల్లో అనుకూలంగా లేని చోట్ల క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఆటలకు సంబంధించిన సామగ్రి వచ్చినా క్రీడాకారులు, విద్యార్థులకు అందించక పోవడంతో వారు సాధన చేయలేక పోతున్నారు. అధికారులు దృష్టి సారించి క్రీడాప్రాంగణాలను చదును చేసి సరైన వసతులు కల్పించాలి.

## ఆదర్శానికి అడుగులు

సిద్దిపేట: సర్కారు బడుల్లో అత్యధిక శాతం పేద విద్యార్థులు చదువుతుంటారు. ప్రభుత్వం వివిధ పథకాల కింద మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తోంది. సిద్దిపేట ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాల, గజ్వేల్ సహా ఇతర కొన్నిచోట్ల ఆదర్శవంతంగా పాఠశాలలు ఆకట్టుకుంటున్నాయి. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో 'బెస్ట్ స్కూల్' అంశానికి ప్రభుత్వం తెరతీసింది. అందులో భాగంగా సిద్దిపేట జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 26 పాఠశాలలను విద్యాశాఖ ప్రాథమిక స్థాయిలో ఎంపిక చేసింది. జాబితాను ప్రభుత్వానికి ఇటీవల పంపించారు.

**డిజిటల్ తెరలపై బోధన**

చిన్నకోడూరు జడ్పీ ఉన్నత పాఠశాల బెస్ట్ స్కూల్ ప్రతిపాదిత జాబితాలో చేరింది. ఇక్కడ 6 - 10వ తరగతి వరకు 289 మంది చదువుతున్నారు. 16 మంది బోధనా సిబ్బంది ఉన్నారు. సొంత భవనం, విశాలమైన మైదానం, చక్కటి వసతులు ఉన్నాయి. 3 తరగతి గదుల్లో డిజిటల్ తెరలపై బోధిస్తున్నారు. మరో ఏడు అవసరం. ప్రయోగశాల, గ్రంథాలయం, భోజనశాల విస్తరణ కావాలి. ఎంఈవోల ద్వారా ప్రగతికి అనుకూలత ఉన్న వాటిని ప్రాధాన్యంగా తీసుకున్నారు. కార్పొరేట్ స్థాయిలో ఆదర్శంగా తీర్చిదిద్దే అవకాశం ఉంది.

**ప్రతిపాదిత జాబితా:** దుబ్బాక ఉన్నత, చింతమడక, చిన్నకోడూరు, వద్దూరు బేగంపేట, కోహెడ, పోతారం (ఎస్), గౌరవెల్లి, నంగునూరు, బక్రిచెప్యాల, వెంకట్రావుపేట, మిరుదొడ్డి, దౌల్తాబాద్, బేగంపేట, నెంటూరు, ములుగు, మర్కుక్, తీగుల్, గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీ, దుద్దెడ, ఐనాపూర్, ఆకునూరు, రేబర్తి, నారాయణరావుపేట, ధూల్మిట్ట, పోతారెడ్డిపేట, చిన్నకిష్టాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

**పూర్తిస్థాయి వసతులు రానున్నాయి-శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి**

బెస్ట్ స్కూళ్ల జాబితాలోని పాఠశాలల విద్యార్థులకు పూర్తి స్థాయి వసతులతో విద్యాబోధన సాగనుంది. ప్రభుత్వం చొరవ చూపి సదుపాయాలు కల్పిస్తుంది.

## కొండపై అందం.. కోరుకున్న చిత్రం

వికారాబాద్ : వికారాబాద్ అనంతగిరి కొండల్లో సినిమాలు తీసేందుకు నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపరిచి, అనుమతి తీసుకునే సదుపాయం కల్పించారు. ఇటీవల అధికారులు హైదరాబాద్‌లో నిర్మాతలతో సమావేశం నిర్వహించి ఈ విధానాన్ని వివరించారు. దీంతో వారంతా ముందుకు వస్తున్నారు.

**నగరానికి 70కిలోమీటర్ల దూరంలో**

హైదరాబాద్ నగరానికి 70 కిలోమీటర్ల దూరంలో అనంతగిరి కొండలున్నాయి. ప్రకృతి రమణీయతతో అలరారుతున్న ఈ కొండలపై ఎన్నో సినిమాలు, టీవీ ధారావాహికలను చిత్రీకరించారు. ఇందులో తెలుగు, హిందీ ఉన్నాయి. 40 ఏళ్లుగా చిత్రీకరణకు నెలవుగా మారాయి. ఎన్టీఆర్ నటించిన టైగర్ చిత్రంలో కొన్ని దృశ్యాలు ఇక్కడే చిత్రీకరించారు. అరుంధతి, నిధి, దేవుళ్లు, నువ్వు- నేను, నాగాస్త్రం, టక్కరి దొంగ, అంజి, జెండా, గుడుంబా శంకర్, ఆర్య, అల్లరి రాముడు, యమదొంగ, కలిసుందాం..రా, వెంకీ, ఆంధ్రావాలా, చక్రం, ఒంటరి తదితర చిత్రాలు ఇక్కడే చిత్రీకరించారు.

**సౌకర్యాలు ఇలా..**

అనంతగిరి కొండపై అందమైన ప్రాంతాలే కాకుండా రైల్వే జంక్షన్, ఆకట్టుకునే అనంత పద్మనాభ డిగ్రీ కళాశాల భవనం ఉన్నాయి. కోట్‌పల్లి ప్రాజెక్టు, శివసాగర్ చెరువు ఉన్నాయి. అనంత పద్మనాభ స్వామి, బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయాలున్నాయి.

**ఎక్కడినుంచైనా.. - జ్ఞానేశ్వర్, జిల్లా అటవీశాఖాధికారి**

నిర్మాతలు ఎక్కడి నుంచైనా అనుమతి తీసుకోవచ్చు. ఆన్‌లైన్ రసీదు చూపితే అనుమతి ఇస్తున్నామన్నారు. ప్రతి నెలా నాలుగైదు రోజుల పాటు ఇక్కడ సినిమా షూటింగ్‌లు జరుగుతున్నాయి.

# సమన్వయం కొరవడి.. అన్నదాతల అలజడి!

సంగారెడ్డి: సింగూరు జలాశయానికి మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో సింగూరు, వనదుర్గా (ఘనపురం) ఆనకట్ట కింద పంట విరామం ప్రకటించాలని అధికారులు నిర?యించారు. అయితే దీనిపై నీటిపారుదలశాఖ అధికారికంగా జీవో జారీచేయలేదు. వ్యవసాయశాఖ కూడా ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించలేదు. ప్రస్తుత యాసంగితో పాటు మరో రెండేళ్ల పాటు సాగు నీరు అందదని నీటిపారుదల శాఖ అధికారులు మౌఖికంగా చెబుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం తమకు సమాచారం లేదని చెబుతున్నారు. ఇరుశాఖల మధ్య సమన్వయం కొరవడి అన్నదాతలకు శాపంగా మారే పరిస్థితి నెలకొంది.

**ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ) ఆదేశాలతో**

ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరికలతో సింగూరు జలాశయం రివిట్‌కు మరమ్మతులు చేపట్టేందుకు నీటిపారుదల శాఖ కసరత్తు చేస్తోంది. ఇటీవలే సాంకేతిక కమిటీ ప్రాజెక్టును సందర్శించి మరమ్మతులు చేపట్టాలని సూచించింది. దీంతో ప్రాజెక్టు నీటిని దిగువకు విడుదల చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి కోరుతూ ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం ఆమోదం తెలుపగానే ఈ నెలాఖరులోపు నీటిని దిగువకు విడుదల చేయాలని నిరయించింది. వచ్చే నెలాఖరులో పనులు ప్రారంభించాలని నిరయించారు. ఈ సీజన్‌తో పాటు మరో నాలుగు




సీజన్‌లకు సాగునీటిని అందించడం సాధ్యం కాదని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. సింగూరు నుంచి విడుదలయ్యే నీటితోనే మెదక్ జిల్లా ఘనపూర్ ఆనకట్ట కింద పంటలు పండిస్తున్నారు.

**సాగుకు సన్నద్ధమైన రైతులు**

పంట విరామం గురించి రైతులకు తెలియకపోవడంతో యాసంగికి సమాయత్తమవుతున్నారు. ఘనపూర్ ఆనకట్ట కింద కొందరు రైతులు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఇరుశాఖల అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. వ్యవసాయశాఖ కూడా ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించాలి. సంగారెడ్డి నీటిపారుదల శాఖ ఇన్‌ఛార్జి సీఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఎన్‌డీఎస్‌ఏ సూచనలతో సింగూర్‌కు మరమ్మతులు చేపడుతున్నామ న్నారు. అందువల్లే ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించనున్నామ న్నారు. సంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఉత్తర్వులు రాలేదని పేర్కొన్నారు.

# కంకర.. ఆకాశానికి ధర

ఆదిలాబాద్ : కంకర ధరలు అమాంతం పెరిగాయి. దీంతో నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇందిరమ్మ ఇళ్లతోపాటు ఇతర నిర్మాణదారులు లబోదిబోమంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల వ్యయంపై భారం పడకూడదని అధికారులు ధరల నియంత్రణ కమిటీ ఏర్పాటు చేసినా అవి నిస్తేజంలో ఉన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే చాలావరకు కంకర జీరోలో దందా నడుస్తోందనే ఆరోపణలున్నాయి. వస్తుసేవల పన్ను(జీఎస్టీ) ఎగవేసి విక్రయిస్తున్నారనే ప్రచారం ఉంది. పైగా ధరలు పెంచి ప్రజలపై భారం మోపుతున్నారు. పేదలు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లకు పిల్లర్లు, స్లాబ్ నిర్మాణానికి కంకర వినియోగం తప్పనిసరి. ధరలు పెరగడంతో ఒక్కో ఇంటికి దాదాపు రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు అదనపు భారం పడుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

**అధికారులు ఏం చేస్తున్నారో..**

ఇందిరమ్మ ఇళ్లపై భారం పడకుండా గనులు, భూగర్భశాఖ అధికారులతో పాటు తహసీల్దార్, ఎంపీడీవో, గృహ నిర్మాణ శాఖ ఏఈ తదితరులతో ఉండే కమిటీ చర్యలు చేపట్టాలి. ఇక్కడ మాత్రం ఎలాంటి నియంత్రణ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయమై గనులు, భూగర్భ శాఖ ఏడీని వివరణ కోరగా.. అది గృహనిర్మాణ శాఖ అధికారులు చూస్తారన్నారు. ఇసుక, కంకరకు జరిమానా వేయడం, చర్యలు తీసుకోవడం మీ శాఖనే చూడాల్సి ఉంటుంది కదా..? అని ప్రశ్నిస్తే.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని వివరించారు.

**రోజుకు 200ల టిప్పర్లు**

జిల్లాలోని ఆదిలాబాద్, ఇచ్చోడ, బోథ్, ఉట్నూరు ఇతరత్రా ప్రాంతాల్లో అన్ని నిర్మాణాలకు కలిపి రోజుకు 200లకు పైగా టిప్పర్ల కంకర విక్రయాలు జరుగుతున్నాయి. ఒక్కో టిప్పర్ రూ.3 వేలకుపైగా ధర పెరగడంతో రోజుకు రూ.6 లక్షలు ప్రజలపై భారం పడుతోంది. ఇలా నెలకు రూ.1.80 కోట్లు అదనంగా సంపాదిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇసుకకూ రూ.500 అదనంగా వసూలు చేస్తున్నారు.

# గ్యాస్ లీకేజీనా..

నిర్మల్ : పేద, ధనిక తారతమ్యం లేకుండా వంటగ్యాస్ వినియోగం అందరికీ చేరువైంది. అయితే, అనుకోని సందరాల్లో ఎప్పుడైనా వంటగ్యాస్ లీకవుతున్నట్లు గుర్తిస్తే ఆందోళనకు గురవడం సహజం. సెలవు రోజులు ఉన్నాయనో, మెకానిక్‌లు అందుబాటులో లేని ప్రాంతమనో కలవరపడొద్దు. టోల్‌ఫ్రీ నంబరు 1906కి కాల్‌చేసి కావాల్సిన సహాయం పొందవచ్చు.

ఎవరు చేయొచ్చు..కంపెనీలు ఏవైనా.. ఈ టోల్‌ఫ్రీ నంబరు అన్నింటికీ వర్తిస్తుంది. దేశమంతా ఇది అందుబాటులో ఉంది. బహుళ భాషల్లో సేవలు అందిస్తుండటంతో మనకు అనువైన భాషను ఎంచుకొని, ప్రాంతం, సమస్యను వివరించడానికి అవకాశముంటుంది. అత్యవసర ఫిర్యాదుగా స్వీకరించి వీలైనంత త్వరగా సిబ్బందిని పంపించి, ఉచితంగా మనకు సేవలందించే ఏర్పాట్లు చేస్తారు. వారాలు, సెలవులు, పండగలతో పనిలేకుండా నిత్యం, 24 గంటల పాటు ఇది పనిచేస్తుంది. ఏం చేయాలి..టోల్‌ఫ్రీ నంబరుకు కాల్‌చేశాం. ఇక మన పని అయిపోయిందనుకోవద్దు. గ్యాస్ వాసన గుర్తించిన వెంటనే సిలిండర్ రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి. ఇంట్లో కరెంటు స్విచ్‌లు ఆఫ్ చేయాలి. అగ్గిడబ్బాలు, లైటర్ వంటివి వినియోగించకుండా చూడాలి. తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలి. ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఉండాలి. సురక్షిత ప్రదేశానికి వెళ్లి టోల్‌ఫ్రీ నంబరులో గ్యాస్ లీకేజీ సమాచారం అందించాలి.

# పేరు చెబితే ఊరు తీరు తెలిసే!



మెట్‌పల్లి: మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాలకు స్థానికంగా ప్రాధాన్యం కలిగిన అంశాలతోనే పేర్లు వచ్చాయి. అక్కడి విశిష‘తలతోనే ఏ ప్రాంతం వారైనా ఆ ఊళ్లను టక్కున గుర్తు పడతారు.

**వెల్లుల్ల ఎల్లమ్మ**

మెట్‌పల్లి మండలం వెల్లుల్లలోని ఎల్లమ్మ ఆలయం పూర్వకాలం నుంచే ప్రసిద్ధి గాంచింది. ఆలయానికి చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాల నుంచి ప్రతి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. దీంతో ఎవరికైనా వెల్లుల్ల గ్రామమంటే ఎల్లమ్మ ఆలయం గుర్తుకొస్తుంది.

**జేసంద్రం.. జగ్గాసాగర్**

జగ్గాసాగర్ గ్రామం కొండస్వామి ఆలయంతో పాటు అక్కడి చెరువుతో గుర్తింపు పొందింది. ఊరి నడిబొడ్డున చెరువు విస్తరించి ఉండటంతో గతంలో ఈ గ్రామాన్ని జేసంద్రం అని పిలిచేవారు. కాలక్రమేణా జగ్గాసాగర్‌గా మారింది. ఇక్కడ పూర్వకాలం నుంచి కొండస్వామి గుట్టపై శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. ఏటా బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు.

**పెద్దాపూర్.. బోనాల వైభవం** పెద్దాపూర్ అంటేనే మల్లన్న క్షేత్రంగా విరాజిల్లుతుంది. చాలా గ్రామాల్లో మల్లన్నస్వామికి బోనాలు వందో, రెండొందలు సమర్పిస్తారు. కాని ఇక్కడి 50 వేల వరకు చెల్లిస్తారు. ఉత్తర తెలంగాణలో అతి పెద్ద బోనాల పండుగగా పేరు పొందింది. కాముడి పౌర?మి మరుసటి ఇక్కడి ఆలయం కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు పలు రాష్ట్రాల భక్తులతో కిటకిటలాడుతుంది. పెద్దాపూర్ గ్రామం పేరు వినగానే బోనాల పండుగ గుర్తొస్తుంది.

**వాగు మొదలయ్యే ఆత్మకూర్**

చుట్టూ గుట్టలు, పచ్చదనంతో పాటు పెద్దవాగు నీటి ప్రవాహం ఆత్మకూర్‌కు వన్నె తెస్తోంది. గతంలో గుట్టల నుంచి వర్షాకాలంలో వచ్చే నీటితో పెద్దవాగు భారీగా ప్రవహించేది. 1983లో భారీగా వరదలు వచ్చి గ్రామం మునిగిపోయింది. అప్పటి నుంచి చుట్టుపక్కల గ్రామాలకు ఆత్మకూర్ అంటే పెద్దవాగు ఘటన గుర్తుకొస్తుంది. మండలంలో ఆత్మకూర్ నుంచే పెద్దవాగు ప్రవాహం మొదలవుతుంది.

**బండలింగాపూర్ సంస్థాన ఠీవీ** బండలింగాపూర్ గ్రామం గతంలో సంస్థానంగా వెలుగొందింది. చుట్టుపక్కల పదుల సంఖ్యలో గ్రామాలు దీని పరిధిలో ఉండేవి. ఈ సంస్థానం నుంచే ఆ గ్రామాల పరిపాలన సాగుతుండేది. దీంతో బండలింగాపూర్‌ను సంస్థాన్ బండలింగాపూర్‌గా పిలుస్తారు. సంస్థాన్ బండలింగాపూర్ అంటే పొరుగు మండలాల్లోనూ తెలియని వారుండరు. ఇప్పటికీ సంస్థాన్ కమాన్ అక్కడ మనకు కనిపిస్తుంది.

# పట్టాలు రద్దు.. ఆక్రమణల పద్దు



జగిత్యాల : ప్రభుత్వ భూములే కదా.. ఎవరు చూస్తారులే.. అనుకున్నారేమో! రికార్డుల్లో లొసుగులే ఆసరాగా తమ పేరిట మార్చుకున్నారు. అనంతరం వచ్చిన ఫిర్యాదులతో అధికారులు పట్టాలు రద్దు చేశారు.. అయినా అక్రమార్కులు ఖాళీ చేయకుండా దర్జాగా అనుభవిస్తున్నారు.. మరోవైపు ప్రభుత్వ అవసరాలకు సర్కారు స్థలాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి..

జగిత్యాల గ్రామీణ మండలం నర్సింగాపూర్ శివారులోని 437 సర్వే నంబరులో మొత్తం 378 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గత ప్రభుత్వ హయాంలో ధరణి అందుబాటులోకి వచ్చాక కొందరు అధికారులతో కుమ్మక్కై దాదాపు 90 ఎకరాలకు పైగా తమ పేరుపై మార్చుకున్నారు. ఈ విషయమై గత జనవరిలో మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు సర్వే నిర్వహించి అక్రమ పట్టాలు పొందిన వారి వివరాలు సేకరించి దాదాపు ఆరు నెలల కిందట రద్దు చేశారు.

**అక్రమార్కులకు ఆదాయ వనరు**

ఇప్పటికీ కొందరు ప్రభుత్వ భూముల్లోనే ఇటుక బట్టీలు, ఇతర పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. మరికొందరు పంటలు సాగు చేస్తున్నారు. ఇంకొందరు మట్టి తరలిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. అధికారులు మాత్రం ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయని చెబుతున్నారు. ప్రస్తుత పంచాయతీ ఎన్నికల తర్వాత అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి, ప్రభుత్వ భూములకు కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. నర్సింగాపూర్ భూములను ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకుంటామని రూరల్ తహసీల్దారు వర్దన్ తెలిపారు.

ఇవీ అవసరాలు

జిల్లా కేంద్రంగా జగిత్యాల ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ కార్యాలయాలకు అధిక విస్తీర?ంలో భూమి అవసరమైంది. పట్టణంలో బహిరంగ సభ నిర్వహణకు పెద్ద స్థలమే లేదు. ఈ సర్వే నంబరులో 300.18 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నందున 20 ఎకరాల్లో స్టేడియం ఏర్పాటు చేస్తే క్రీడలతో పాటు సభలు, సమావేశాల నిర్వహణకు ఉపయోగపడుతుంది.

టీఆర్‌నగర్ నుంచి ప్రభుత్వ భూములను ఆనుకొని నూకపల్లి అర్బన్‌కాలనీ మీదుగా మల్యాల వరకు రెండు వరుసల రహదారి నిర్మిస్తే న్యాక్‌తో పాటు రెండు పడక గదుల ఇళ్లకు ఉపయోగపడనుంది. కొత్తగా స్టేడియం నిర్మించే ప్రాంతానికీ ఈ రహదారి ఉపయోగపడనుంది.

ఇదే ప్రాంతంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ను ఏర్పాటు చేశారు. వీటితో పాటు గురుకుల పాఠశాలలకు, ప్రభుత్వ కార్యాలయాలకు నర్సింగాపూర్ భూములను వినియోగించుకోవచ్చు. జిల్లా కేంద్రంలో ఉన్న జైలుకు స్థలం సరిపోవడం లేదు. నర్సింగాపూర్ ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తే సౌకర్యంగా ఉండనుంది. మరిన్ని కార్యాలయాలకు స్థలం అవసరమున్నందున ఈ భూములను ఉపయోగించుకోవచ్చన్న ఆలోచన ఉంది.

కబ్జాలో ఉన్న భూములను స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# రెండేళ్లు.. రూ.895.82 కోట్లు



కరీంనగర్ : తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన మహాలక్ష్మి పథకం మహిళా ప్రయాణికులకు వరంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబరు 9 నుంచి ఈ పథకం ద్వారా ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించింది. శుభకార్యాలు, పుణ్యక్షేత్రాలు, వివిధ ప్రాంతాలకు విధులకు వెళ్లే వారు, ఆసుపత్రులకు వెళ్లేవారు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించడానికి ఆసక్తి చూపుతున్నారు. కోట్లాది మంది ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. రెండేళ్లలో కరీంనగర్ రీజియన్‌లో మహాలక్ష్మి పథకాన్ని ఉపయోగించుకున్న మహిళలపై కథనం.

**రెండేళ్లు.. 21 కోట్లు..**

కరీంనగర్ రీజియన్‌లో 11 డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలోని పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మహిళా ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. రీజియన్‌లో రెండేళ్లలో 32.76 కోట్ల మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించగా అందులో 21.96 కోట్ల మంది (దాదాపు 65 శాతం) మహిళలు ఉండటం విశేషం. ప్రతి పది మందిలో ఆరుగురు మహిళలే ఉంటున్నారు. రెండేళ్లలో మొత్తం ఆదాయం రూ.1749.53 కోట్లు రాగా, ఇందులో ఉచిత ప్రయాణం ద్వారా మహిళలు రూ.895.82 కోట్లు ఆదా చేసుకున్నారు. 2023-2024తో పోల్చితే 2024-2025లో అదనంగా 1.80 కోట్ల మంది మహిళలు ప్రయాణించి రూ.86.78 లక్షలు ఆదా చేసుకున్నారు. ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) కూడా గణనీయంగా పెరిగింది.

**పెరిగిన ప్రయాణికుల సంఖ్య**

మహాలక్ష్మి పథకానికి విశేష స్పందన లభిస్తోంది. ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అందులో ఎక్కువగా మహిళలు ఉంటున్నారు. రద్దీకి అనుగుణంగా ఆయా రూట్లలో సర్వీసులు తిరిగేలా చూస్తున్నాం. కొత్త బస్సులు కూడా వచ్చాయి. ఆర్టీసీ, అద్దె, ఎలక్ట్రిక్ బస్సులు రీజియన్ పరిధిలో సేవలందిస్తున్నాయి.

– బి.రాజు, రీజినల్ మేనేజర్

# ఆగని ఇసుక దందా!

జైపూర్: మైనింగ్ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని జైపూర్ మండలంలో ఇసుక అక్రమ దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అక్రమ రవాణా కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని అధికార వర్గాలు చెబుతున్నా వాటి ఫలితాలు మాత్రం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. అక్రమార్కుల ఆదాయ వేటలో మితిమీరిన వేగానికి అమాయకులు బలైపోతున్నారు. తాజాగా సోమవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. భీమారంనకు చెందిన పోడేటి మల్లయ్య (70) అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు బొలెరో వాహనంలో మంచిర్యాల ఆసుపత్రికి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో రసూల్‌పల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక తీసుకెళ్తున్న ట్రాక్టర్ నర్వ సమీపంలోని జాతీయ రహదారిలోని యూటర్న్ వద్ద ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో



ట్రాక్టర్ రెండు ముక్కలైంది. బొలెరోలో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలు కాగా వారిని 108 ద్వారా మంచిర్యాలకు తరలించగా మల్లయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**కాసుల వేటలో..**

ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల పేరు చెప్పి చీటీల పేరుతో అక్రమ రవాణాకు పాల్పడిన పలువురు ట్రాక్టర్ల యజమానులు అధికారులు హడావుడి చేయడంతో కాస్త తగ్గారు. ఇందారం వద్ద ఆన్‌లైన్‌లో ఇసుక లభ్యత ఉన్నా కాసులకు కక్కుర్తి పడి రాత్రి వేళ రసూల్‌పల్లి వాగు నుంచి అక్రమంగా రవాణా చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. పోలీసు ఉన్నతాధికారులు కార్యాలయాలకు కూతవేటు దూరంతో పాటు జాతీయ రహదారి పక్కనే అక్రమ దందా సాగుతున్నా వాటి కట్టడికి మంత్రి ఇచ్చిన ఆదేశాలు, అధికారులు తీసుకున్న చర్యలకు ఫలితాలు కనిపించడం లేదు.

# అటు కోస్టాల.. ఇటు తల్లాడ

తల్లాడ : పల్లెల్లో ఎటుచూసినా పంచాయతీ ఎన్నికల కోలాహలమే కనిపిస్తోంది. మొదటి విడత పోలింగ్‌కూ రోజు వ్యవధే ఉంది. ఎక్కడ చూసినా అభ్యర్థులు కాలికి బలపం కట్టుకుని తిరుగుతున్నారు. కొంతమంది ఇప్పటికే పంచాయతీ అంతటినీ మూడు నాలుగుసార్లు సులువుగా చుట్టేయగా, కొన్ని పంచాయతీల్లో మాత్రం ఆపసోపాలు పడుతున్నారు. ఓటర్లు, విస్తీర్ణం, వార్డుల సంఖ్యలో వ్యత్యాసం ఉండటమే ఇందుకు కారణం. చిన్న ఊళ్లలో సర్పంచి అభ్యర్థులకు ప్రచారం నల్లేరుమీద నడకలా మారింది. జిల్లాలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గరిష‘-కనిష‘ వివరాలతో కూడిన కథనమిది.

ఓటర్లల్లాలో అతి తక్కువ మంది ఓటర్లు ఉన్న గ్రామం వైరా మండలంలోని కోస్టాల. ఇక్కడ 254 మంది ఓటర్లున్నారు. పంచాయతీలో మొత్తం ఎనిమిది వార్డులుండగా రెండో వార్డులో అతి తక్కువగా 27 మందికి ఓటుహక్కు కలదు.

అత్యధిక ఓటర్లున్న గ్రామ పంచాయతీ తల్లాడ. ఇక్కడ ఓట్ల సంఖ్య 7,898. మొత్తం 14 వార్డుల్లో ఏడో వార్డులో తక్కువగా 543 ఓట్లు, 11వ వార్డులో గరిష‘ంగా 575 ఓట్లు ఉన్నాయి.

ఇక్కడా ఇరుగు పొరుగే..మహిళా ఓటర్లు తక్కువగా ఉన్న పంచాయతీ వైరా మండలంలోని కోస్టాల (130 మంది) కాగా ఎక్కువగా తల్లాడలో (4,198) ఉన్నారు. పురుష ఓటర్ల విషయంలోనూ కోస్టాల (124), తల్లాడ (3,700)లే కనిష‘, గరిష‘ సంఖ్యను సొంతం చేసుకున్నాయి. వార్డులు జిల్లాలోని పంచాయతీల్లో కనిష‘ వార్డుల సంఖ్య ఆరు. ఇలాంటి పరిస్థితి 17 పంచాయతీల్లో ఉంది. ఇందులో ఒక్క రఘునాథపాలెం మండలంలోనే ఎనిమిది ఉండటం విశేషం. 500 జనాభా కలిగిన తండాలను పంచాయతీలుగా మార్చిన క్రమంలో దీనికి ఈ ప్రత్యేకత సొంతమైంది. పంచాయతీల్లో గరిష‘ వార్డుల సంఖ్య 14. కొణిజర్ల, తనికెళ్ల, ముదిగొండ, వల్లభి, నేలకొండపల్లి, తల్లాడ, అన్నారుగూడెం, వేంసూరు మండలం కందుకూరు గ్రామాల్లో మాత్రమే ఈ సంఖ్యలో వార్డులు ఉన్నాయి.

పంచాయతీలు

తక్కువ ఖమ్మం గ్రామీణం, సత్తుపల్లి

జిల్లాలో తక్కువ పంచాయతీలున్న మండలాలు ఖమ్మం గ్రామీణం, సత్తుపల్లి. ఇక్కడ కేవలం 21 ఉన్నాయి. కూసుమంచి, కారేపల్లి మండలాల్లో అత్యధికంగా 41 చొప్పున పంచాయతీలున్నాయి.

రెండూ పక్కపక్కనే అతి తక్కువ గ్రామ పంచాయతీలు కలిగిన నియోజకవర్గం ఖమ్మం. ఇందులో గ్రామీణ ప్రాంతం రఘునాథపాలెం మండలం ఒక్కటే ఉండగా.. 37 పంచాయతీలున్నాయి. పక్కనే ఉన్న పాలేరు నియోజకవర్గంలో జిల్లాలోనే గరిష‘ంగా 134 పంచాయతీలు ఉండటం విశేషం.

# ఈసారైనా.. లక్ష్యం నెరవేరేనా?

కొత్తగూడెం : ఖమ్మం జిల్లాతో పోల్చితే భద్రాద్రి జిల్లా బ్యాంకర్లు.. రుణాల మంజూరులో వెనుకబడుతున్నారు. గిరిజన ప్రాంతాల ప్రత్యేక చట్టాలు, భూముల మార్టిగేజ్ సమస్యలు రైతులకు అడుగడుగునా అడ్డంకిగా మారుతున్నాయి. పంటల పెట్టుబడి కోసం బ్యాంకులకు వెళ్తున్న కర్షకులకు రుణ నిరాకరణ తీరని ఆర్థికభారాన్ని మిగుల్చుతోంది. ముఖ్యంగా రాష్ట్రంలోనే అత్యధికంగా పోడుపట్టాలు పంపిణీ చేసిన భద్రాద్రి జిల్లాలో బ్యాంకర్లు వాటికి రుణాలు అందించకపోవటం గమనార్హం. ఎస్‌బీఐ మినహా మిగతా బ్యాంకులు పోడుపట్టాలకు రుణాలు నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది.

భద్రాద్రి జిల్లాలో..

వ్యవసాయ అనుబంధ రంగాలకు ఆశించిన స్థాయిలో రుణాలు అందటం లేదు. 2024-25 వార్షిక రుణ ప్రణాళికలో పంట రుణాల కింద రూ.3,954.61కోట్లు కేటాయించగా రూ.3,245.82కోట్లు(82శాతం) మాత్రమే రైతులకు అందించగలిగారు. 2025-26 వార్షిక రుణ ప్రణాళికలో వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.3,899.28కోట్లు కేటాయించగా తొలి త్రైమాసికం ముగిసే నాటికి రూ.2,138.26కోట్లు(54.84శాతం) మాత్రమే రైతులకు మంజూరు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరమైనా లక్ష్యం మేరకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేస్తేనే కర్షకులకు మేలు జరుగుతుంది.

స్వయం ఉపాధికి ఊతమిస్తేనే..

భద్రాద్రి జిల్లాలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి మార్గాలు చూపేలా రుణాలు మంజూరుచేయాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో బ్యాంకర్లకు సూచించారు. సమీకృత వ్యవసాయం, కొర్రమీను చేపల పెంపకం యూనిట్ల స్థాపనకు రుణాలు అందించాలన్నారు. చిన్నచిన్న కారణాలతో రైతుల దరఖాస్తులను తిరస్కరించకుండా జిల్లా అభివృద్ధికి తోడ్పడేలా అప్పులు ఇవ్వాలన్నారు. తద్వారా బ్యాంకర్లు సైతం రుణ లక్ష్యాలను అధిగమిస్తారని తెలిపారు.

## గచ్చిబౌలి ఎఫ్‌సీఐ లేఅవుట్‌లో అక్రమ కట్టడాల కూల్చివేత

గచ్చిబౌలి : గచ్చిబౌలి ఎఫ్‌సీఐ లేఅవుట్‌లో అక్రమకట్టడాలను హైడ్రా కూల్చివేసింది. గచ్చిబౌలి ప్రధాన రోడ్డును అనుకొని 20 ఎకరాల్లో విస్తరించిన ఎఫ్‌సీఐ లేఅవుట్‌లో 162 ప్లాట్లున్నాయి. సంధ్యా కన్వెన్షన్ సెంటర్ అధినేత శ్రీధర్‌రావు లేఅవుట్‌లోని రోడ్లు, పార్కులు ఆక్రమించి ఫుడ్‌కోర్టులు, పెట్రోల్ బంక్, పలు షెడ్లు నిర్మించారు. 40 ఏళ్ల క్రితం వేసిన లేఅవుట్‌ను శ్రీధర్‌రావు నామరూపాలు లేకుండా చేశారని ప్లాట్ల యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. తీవ్రంగా పరిగణించి హైకోర్టు వెంటనే ఆక్రమణలు తొలగించాలని ఆదేశించింది. హైడ్రాఅధికారులు రంగంలోకి దిగి భారీ యంత్రాలతో సోమవారం ఉదయం 6 గంటల నుంచే కూల్చివేతలు ప్రారంభించారు.



ఏడు ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించి కట్టిన నిర్మాణాలు తొలగించారు. 40 అడుగుల రోడ్డుపైకి వచ్చిన ఓ భవనానికి సంబంధించిన సెల్లార్ ర్యాంపులు, ఫుడ్‌కోర్ట్‌లు, ఐరన్ ఫ్రేమ్‌తో నిర్మించిన ఐదంతస్తుల భవనాన్ని కూల్చివేశారు.

**యథాతథ స్థితికి ఆదేశం**

గచ్చిబౌలిలోని సర్వే నంబరు 124, 125లో నిర్మాణాలను కూల్చివేయడాన్ని సవాలు చేస్తూ సంధ్య హెటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ అత్యవసరంగా కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. జస్టిస్‌విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టగా.. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ చట్టప్రకారం వ్యవహరించాలన్న కోర్టు ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందన్నారు. ఇప్పటికే 70 శాతం కూల్చివేసి రూ.కోట్ల నష్టం కలిగించిందని, తదుపరి కూల్చివేతలపై స్టేఇవ్వాలని కోరారు. దీంతో న్యాయమూర్తి విచారణను వాయిదా వేస్తూ కూల్చివేతలపై యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశించింది.

## అడ్డగోలుగా తవ్వకాలు.. భవనానికి బీటలు

గోషామహల్: ఇంటి నిర్మాణం కోసం తవ్వకాలు చేపడుతుండగా పక్కనే ఉన్న బహుళ అంతస్తుల భవనానికి బీటలు వారడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గోషామహల్ చాక్నావాడీలో సుమారు ఎనభై గజాల స్థలంలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణంలో భాగంగా పునాదుల కోసం తవ్వుతుండగా పక్కనే ఉన్న బహుళ అంతస్తుల భవనం కుదుపునకు గురై బీటలు వారింది. దీంతో ఆ ఇంట్లోని వారు భయంతో పరుగులు తీశారు. మరోవైపు ఉన్న ఇంకో బహుళ అంతస్తుల



భవనం ఇంటి యజమానులు భయంతో ఇల్లు వదిలి బయటకు వెళ్లిపోయారు గోషామహల్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్సై లక్ష్మయ్య, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. డీసీ ఉమా ప్రకాశ్ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ అధికారి మహేందర్ సంఘటనా స్థలానికి చేరుకొని ఇంటి నిర్మాణం చేపట్టిన వ్యక్తిని విచారించారు. అనుమతులు లేకుండా పనులు చేపడుతున్న సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## ఈకేవైసీ ఇంకా సాగుతూనే..!

రాజపేట : జిల్లాలో ఉపాధి కూలీలకు ఈకేవైసీ అనుసంధాన ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇప్పటి వరకు మోత్కూరు మండలం ముందంజలో ఉండగా రాజపేట మండలం వెనుకంజలో ఉంది. కేంద్ర ప్రభుత్వం పనుల్లో పారదర్శకతకు ఈకేవైసీ అమలు చేస్తున్న విషయం తెలిసిందే. గత నెల రోజుల క్రితం ఈ కార్యక్రమం మొదలైనా ఇంకా కొనసాగుతూనే ఉంది. సంబంధిత వివరాలు క్లుప్తంగా..



**ఆలస్యానికి కారణాలు ఇవీ..**

జిల్లా వ్యాప్తంగా ఉపాధిహామీ పనుల్లో పాల్గొంటున్న కూలీల సంఖ్య 1,27,024 ఇప్పటి వరకు 1,16,266 మంది ఈకేవైసీ పూర్తయిందని ఇంకా 10,758 మంది కూలీలు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. కొందరు స్థానికంగా లేకపోవడం, మరి కొందరు వలస వెళ్లడం, ఇంకొందరు ఆధార్‌కార్డు అప్‌డేట్ కాకపోవడం తదితర కారణాలతో ఆలస్యమువుతుందని తెలుస్తోంది. ఈకేవైసీ చేయించుకుంటేనే భవిష్యత్తులో పనులు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో తెలిసిన వారి ద్వారా వలస కూలీలకు సమాచారం ఇస్తున్నారు. ప్రస్తుతం వివిధ రకాల పనుల సీజన్ కావడంతో కూలీలు జాప్యం చేస్తున్నారు. త్వరలో వంద శాతం పూర్తి చేయాలని ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కనిపించని స్థితి నెలకొంది.

## అవిశ్రాంతంగా పనిచేసినా.. కష్టాలు శేషమే!



కామారెడ్డి : వారంతా సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వ శాఖల్లో అవిశ్రాంతంగా సేవలందించారు. పదవీ విరమణ పొందాక శేష జీవితం సంతోషంగా గడుపుదామనుకున్నారు. కానీ, ప్రభుత్వ నిర్లక్ష్యంతో వారికి నిరాశే మిగులుతోంది. సర్కారు నుంచి ఆర్థిక ప్రయోజనాలు అందక మనోవేదనకు గురవుతున్నారు. పిల్లల వివాహాలు, ఇంటి రుణాలు, ఇతర అవసరాలకు సొమ్ము అందడం లేదని, దీంతో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటూ మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అన్ని ప్రభుత్వ విభాగాల్లో ప్రతినెలా 60 మందికి పైగా పదవీ విరమణ పొందుతున్నారు. కేడర్(స్థాయి)కు అనుగుణంగా ఒక్కో విశ్రాంత ఉద్యోగికి రూ.35 లక్షల నుంచి రూ.85 లక్షలు అందాలి. ఈ లెక్కన ఏటా రూ.210 కోట్ల నుంచి రూ.600 కోట్ల దాకా సర్కారు చెల్లించాల్సి ఉంది.

**వైద్య సేవలు కరవు**

విశ్రాంత ఉద్యోగులకు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స అందించాలి. ప్రతినెలా వందల సంఖ్యలో పదవీ విరమణ చేసినవారు వివిధ ఆరోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు వెళుతున్నారు. ప్రభుత్వ ప్రయోజనాలు అందక అక్కడ రూ.లక్షల సొంత డబ్బును ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వానికి గతంలో సమర్పించిన బిల్లులూ అపరిష్కృతంగానే ఉన్నాయని విశ్రాంత ఉద్యోగులు వాపోతున్నారు.

విశ్రాంత ఉద్యోగులు ఒక్కొక్కరు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు బ్యాంకు రుణం తీసుకుని ఇళ్లు నిర్మించుకున్నారు. వాటికి నెలనెలా రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు ఈఎంఐ చెల్లించాలి. దీనికి తోడు పిల్లల చదువులు, వివాహాలకు రూ.లక్షల్లో ఖర్చు అవుతోంది.

పదవీ విరమణ చేసిన వారికి ప్రభుత్వం నెల రోజుల్లో పూర్తి బకాయిలు చెల్లించాలని కామారెడ్డి విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్. విఠల్‌రావు కోరారు.

"ఈయన పేరు మధుసూదన్‌రావు. ఉపాధ్యాయుడిగా పనిచేసి 2024లో పదవీ విరమణ పొందారు. ఇతనికి రూ. 50 లక్షల వరకు జీపీఎఫ్ రావాలి. ఇంతవరకూ మంజూరు కాలేదు. ఇంటి నిర్మాణం కోసం తీసుకున్న రుణానికి ప్రతినెలా రూ.35 వేలు ఈఎంఐ చెల్లించాలి. ఇద్దరు పిల్లల్లో ఒకరికే వివాహం జరిగింది. మరొకరికి వివాహం చేయాలి. ప్రభుత్వం నుంచి పదవీ విరమణ ప్రయోజనాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు"

## నిరభ్యంతరంగా.. చెరపట్టారు..!



కామారెడ్డి : భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో సర్వే నం.936లో ఎసైన్డ్ భూమి ఉంది. ఇందులోని 161 ఎకరాలను ప్రభుత్వం గతంలో నిరుపేదలకు పంపిణీ చేసింది. ఆ భూములను కొన్నేళ్లుగా పేద రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ స్థలంపై ఓ రెవెన్యూ ఉద్యోగి కన్ను పడింది. పేదలకు కొంత ముట్టజెప్పాడు. 21 ఎకరాలను తన బినామీల పేరిట కొనుగోలు చేశాడు. 2017-18లో ఆ బినామీల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నాడు. తర్వాత 2021-22లో ఆ స్థలాలకు నిరభ్యంతర పత్రాలు(ఎన్వోసీ) తీసుకుని 16 ఎకరాలు పట్టా చేసుకున్నాడు.

ఎన్నేళ్లైనా.. ఏ ఊళ్లోనైనా భూమి విస్తీర్ణం ఎప్పటికీ పెరగదు. కామారెడ్డి జిల్లాలో మాత్రం పట్టా భూముల విస్తీర్ణం గత ఐదేళ్లుగా పెరుగుతూనే ఉంది. వింతగా అనిపిస్తున్నా.. ఇది నిజం! అధికారుల అండదండలతో అక్రమార్కులు చేస్తున్న మాయాజాలం!! ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ శాఖలోని కొందరు అధికారులు కంచే చేను మేస్తున్న చందంలా వ్యవహరిస్తున్నారు. సర్కారు స్థలాలకు ఎన్వోసీలు జారీ చేస్తూ వాటిని ఆక్రమిస్తున్నారు. చిన్న లొసుగులు అడ్డం పెట్టుకుని అక్రమార్కులకు వంత పాడుతున్నారు. జిల్లాలో గడిచిన ఐదారేళ్లలో 200 ఎకరాలకు పైగా భూములకు ఉన్నతాధికారులు ఎన్వోసీలు జారీ చేశారు. వాటిలో కొన్ని ఎకరాలను కొందరు.. పేదలకు కొంత ముట్టజెప్పి తమ వశం చేసుకున్నారు. దీంతో జిల్లాలో పట్టా భూమి పెరిగింది. అనర్హులు ప్రభుత్వ స్థలాలను సొంతం చేసుకున్నారు.

**ఆర్ఎస్ఆర్ కంటే అధికంగా..** రెవెన్యూ సెటిల్‌మెంట్ రికార్డ్(ఆర్ఎస్ఆర్).. ఒక సర్వే నంబర్‌లో ఎంత భూమి ఉందో కచ్చితంగా సూచిస్తుంది. భూ రికార్డులు మార్పులు చేసినప్పుడు ఆ వివరాలను ఆర్ఎస్ఆర్‌లో నమోదు చేస్తారు. వీటిని గతంలో మాన్యువల్‌గా నమోదు చేసేవారు. ఇప్పుడు భూభారతిలో డిజిటల్ విధానం ద్వారా నమోదు చేస్తున్నారు. ఒక సర్వే నంబర్‌లో ఎన్ని ఎకరాల భూమి ఉంటే అన్ని ఎకరాలు మాత్రమే నమోదు చేయాలి. అంతకంటే అధికంగా నమోదు చేయడానికి వీలుపడదు. జిల్లాలోని చాలా గ్రామాల్లో ఆర్ఎస్ఆర్‌లో నమోదైన విస్తీర్ణం కంటే ఎక్కువగా నమోదు చేశారు. ఇలా జిల్లాలో ఎసైన్డ్ భూవిస్తీర్ణం పెరిగినట్లయింది. జిల్లాలో 2020-22 మధ్యకాలంలో జారీ చేసిన 34 నిరభ్యంతర పత్రాల్లో 25 నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసినవే. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ చేపడితే అక్రమార్కుల బాగోతం వెలుగుచూసే అవకాశముంది.

## గ్రంథాలయాల్లో.. సమస్యల పుటలు

ఎడపల్లి :గ్రంథాలయం.. పుస్తకగని.. ఉద్యోగార్థులకు వరం.. నిత్యం చాలా మంది వస్తుంటారు.. కొందరు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతుంటారు.. మరికొందరు పుస్తక పఠనం చేస్తుంటారు.. అయితే విజ్ఞాన భాండాగారాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కిరాయి భవనాల్లో అరకొర వసతుల నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రస్తుతం గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రతినిధులు పరిశీలన చేసి ఇస్తున్న కథనమిది.రెంజల్ లైబ్రరీకి చదువుకునేందుకు గతంలో 50 మందికి పైగా వచ్చేవారు. ప్రస్తుతం ఇరుకైన కిరాయి గదిలో కొనసాగుతుండటంతో ఆ సంఖ్య 25కు పడిపోయింది. రెండున్నర ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉంది. పక్కా భవనం నిర్మించినా ప్రారంభానికి నోచుకోలేదు. 50 కుర్చీలు అవసరం ఉండగా.. 22 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇరుకైన కిరాయి భవనం కావడంతో కుర్చీలు అటకెక్కాయి. కావాల్సిన పుస్తకాలు అందుబాటులో లేక ఉద్యోగార్థులు వెనుదిరుగుతున్నారు. పాఠకుల సౌకర్యార్థం మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. ఈ విషయమై గ్రంథపాలకుడు సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. 'కుర్చీలు, పుస్తకాల అవసరాన్ని గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్‌తో పాటు జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్లాం. నూతన భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. పుస్తకాలు భద్రపరిచేందుకు ర్యాక్‌ల అవసరాన్ని విన్నవించాం' అని చెప్పారు.

**అందుబాటులోకి రాక..**

నవీపేట లైబ్రరీకి చదువుకునేందుకు రోజూ 40 మంది వస్తారు. గ్రంథాలయ ప్రాంగణంలో నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. వీటిని నూతనంగా నిర్మించగా ఇప్పటి వరకు వినియోగంలోకి తీసుకురాలేదు. ప్రస్తుతం ఉన్న గది ఇరుకుగా మారడంతో పాఠకులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై గ్రంథపాలకుడు సందీప్ మాట్లాడుతూ.. 'ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మూత్రశాలలు, మరుగుదొడ్లతో పాటు పైఅంతస్తులో నిర్మించిన గదిని అందుబాటులోకి తెచ్చేలా చూస్తాం' అని చెప్పారు.

**ఇరుకు గదుల్లో అవస్థలు** నందిపేట గ్రంథాలయానికి నిత్యం 25 నుంచి 30మంది వస్తుంటారు. ఇది కిరాయి భవనంలో కొనసాగుతోంది. సొంత భవనం లేకపోవడంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. ఇరుకు గదుల్లో కూర్చోవడానికి అవస్థలు పడుతున్నారు. ఈ భవనం రోడ్డు పక్కనే ఉండటంతో వాహనాల శబ్దంతో పఠనంపై దృష్టి పెట్టలేకపోతున్నారు. ఈ విషయమై గ్రంథపాలకురాలు నిర్మలా మాట్లాడుతూ.. 'ప్రభుత్వం సొంత భవనం నిర్మిస్తామని చెప్పింది, పాఠకులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం' అని చెప్పారు.

**శివారు ప్రాంతం.. కిరాయి భవనం**

బీర్కూర్‌లో 30 ఏళ్ల కిందట నిర్మించిన లైబ్రరీ శిథిలావస్థకు చేరింది. వర్షం కురిసిన ప్రతిసారి నీరు లోపలికి చేరుతోంది. దీంతో ఏడాది కిందట గ్రామ శివారులోని కిరాయి భవనంలోకి మార్చారు. నెలకు రూ.6 వేలు కిరాయి చెల్లిస్తున్నారు. పాత భవనంలో లైబ్రరీ కొనసాగినప్పుడు నిత్యం 100 మంది పాఠకులు వచ్చేవారు. శివారు ప్రాంతానికి మార్చడంతో ఆ సంఖ్య 50కి పడిపోయింది. ఈ విషయమై ఇన్‌ఛార్జి గ్రంథపాలకుడు హమీద్ మాట్లాడుతూ.. 'కొత్త భవనం నిర్మించాలని జిల్లా అధికారులకు విన్నవించాం' అని చెప్పారు.

**రద్దీకి అనుగుణంగా లేని ఫర్నిచర్**

కామారెడ్డి జిల్లా గ్రంథాలయంలో డిజిటలైజేషన్ చేస్తామన్నా ఇప్పటి వరకు చర్యలు లేవు. కలెక్టర్‌గా సత్యనారాయణ పనిచేసినప్పుడు గ్రంథాలయ నూతన భవనాలు నిర్మించారు. అన్ని గదుల్లో అధునాతన ఫర్నిచర్, ఏసీలు ఏర్పాటు చేశారు. అయితే రద్దీకి అనుగుణంగా ఇక్కడ ఫర్నిచర్ సరిపోవడం లేదు. వరండాలో కూర్చుని చదువుకునే పరిస్థితి ఉంది. తినడానికి వీలుగా భోజనశాలలు లేవు. గ్రంథాలయం పక్కనే ఉన్న ఉద్యానంలో కూర్చొని తింటున్నారు. వాహనాల పార్కింగ్‌కు షెడ్లు లేవు. ఈ విషయమై గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ..'గ్రంథాలయాల అభివృద్ధికి దాతల సాయంతో వసతులు కల్పిస్తున్నాం. పుస్తకాలు, ఫర్నిచర్ కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు. **నీటి వసతి లేదు** ఎడపల్లి గ్రంథాలయానికి రోజూ చదువుకునేందుకు సుమారు 50 మంది వస్తుంటారు. ఇక్కడ నీటి వసతి లేక మూత్రశాల లు, మరుగుదొడ్లు వినియోగంలో లేవు. దీంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలు కూడా అందుబాటులో లేవు. ప్రహరీ నిర్మాణం ఇప్పటి వరకు చేపట్టలేదు. ఈ విషయమై ఇన్‌ఛార్జి గ్రంథపాలకుడు గంగాధర్ మాట్లాడుతూ.. 'నీటి వసతి లేదన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నీటి వసతి ఏర్పాటు చేస్తే మూత్రశాలలు, మరుగుదొడ్డిని వినియోగంలోకి తీసుకురావొచ్చు' అని చెప్పారు. **ఉమ్మడి జిల్లా వివరాలు** శాఖ గ్రంథాలయాలు : 43 గ్రామీణ : 30 రోజూ గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్య : 4500 కిరాయి భవనాల్లో కొనసాగేవి : 16

## తడోబా.. చూసొద్దామా!

బల్లార్ష: దేశంలోనే ప్రసిద్ధి చెందిన అభయారణ్యాలలో తడోబా ఒకటి. ఇక్కడ పదుల సంఖ్యలో ఉన్న పులులు, ఇతర వన్యప్రాణులను ప్రత్యక్షంగా చూసి పర్యాటకులు పరవశించిపోతుంటారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో 1727.59 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కొలువుతీరిన ఈ అభయారణ్యాలలో బఫర్, కోర్ జోన్లుగా విభజించారు. మధ్యభాగంలో 623 చదరపు కిలోమీటర్ల ప్రదేశంలో కోర్ జోన్ ఏర్పాటు చేశారు. ఈ జోన్‌లో కేవలం పులులతో పాటు ఇతర జంతువులు మాత్రమే సంచరిస్తుంటాయి. దీనికి చుట్టుపక్కల మిగిలిన ప్రాంతమంతా బఫర్ జోన్‌గా పిలుస్తారు. ఈ ప్రాంతంలో జనజీవనం ఉంటుంది. 2019 లెక్కల ప్రకారం.. ఈ అభయారణ్యాలలో 115 పులులు ఉన్నాయి.

**పర్యటించే సమయం:** అభయారణ్యాలలోని ప్రధాన ద్వారాల నుంచి ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు సంచరించే అవకాశం ఉంటుంది. మంగళవారం కోర్ జోన్‌లో, బఫర్‌జోన్‌లకు సెలవు. దీంతో పాటు ఏటా జులై నుంచి సెప్టెంబరు వరకు వర్షాకాలంలో పర్యాటకులను అనుమతించరు.



**ప్రధాన ద్వారాలు:** పర్యాటకులు కోర్ జోన్‌లో పర్యటించి ప్రత్యక్షంగా పులులను తిలకించేందుకు దీని చుట్టుపక్కలా.. మొహర్లీ, కోలార, నవేగావ్, కుట్‌వన్‌డా, ఝరీ, పంగడి అనే ప్రాంతాలలో ఆరు ప్రధాన ద్వారాలు ఏర్పాటు చేశారు. టికెట్లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారు వీటి వద్ద నుంచి అభయారణ్యాలు ఏర్పాటు చేసిన టాప్‌లెస్ ప్రత్యేక జిప్సీలలో గైడ్‌తోపాటు పర్యటించే అవకాశం కల్పిస్తారు. నాగ్‌పూర్ ద్వారా వచ్చే పర్యాటకులకు కోలార, నవేగావ్, ఝరీ గేట్లు అనుకూలంగా ఉంటాయి.

**ఇలా చేరుకోవచ్చు**

హైదరాబాద్ నుంచి దిల్లీ వెళ్లే రైలు మార్గంలో చంద్రపూర్ స్టేషన్‌లో దిగాల్సి ఉంటుంది. అక్కడ నుంచి 40 కి.మీ. దూరంలో కోర్‌జోన్ మొహర్లీ గేట్ ద్వారా లోపలికి వెళ్లొచ్చు.

**రహదారి మార్గంలో..** హైదరాబాద్ నుంచి అయితే.. కరీంనగర్-గోదావరిఖని-మంచిర్యాల-బెల్లంపల్లి-ఆసిఫాబాద్, బల్లార్ష-చంద్రపూర్. 381 కి.మీ. దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ నుంచి అయితే.. బేల-కోర్పన-గడ్‌చాందూర్-రాజూర-బల్లార్ష-చంద్రపూర్. 107 కి.మీ. ఉంటుంది.

## ఉపాధి కార్డు.. జీవితకాలం చెల్లుబాటు

మెదక్ : ఉన్నత విద్యాభ్యాసం చేసి ఉద్యోగానికి ఎదురుచూసే నిరుద్యోగులు గతంలో ప్రభుత్వ ఉపాధి కల్పన కార్యాలయాల్లో తమ పేర్లు నమోదు చేసుకొని కార్డు పొందేవారు. ఆ తర్వాత ప్రతి మూడేళ్లకోసారి వీటిని పునరుద్ధరణ చేసుకోవాలి. అయితే ఈ సమయంలో అభ్యర్థులు నానాపాట్లు పడాల్సిందే. దీన్ని గుర్తించిన ప్రభుత్వం శాశ్వత ఉపాధి కార్డులు అందించాలని నిర్ణయించి అమలుకు శ్రీకారం చుట్టడం విశేషం.

**ఒక్కసారి దరఖాస్తుతో..** ఉపాధి కల్పన వెబ్‌సైట్‌లో ఒక్కసారి పేర్లు నమోదు చేసుకుంటే జీవితకాలం చెల్లుబాటవుతుంది. జిల్లా ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న ఒక్క రోజులోనే శాశ్వత పత్రాలు ఆన్‌లైన్‌లోనే అందుకోవచ్చు. కార్డుల పునరుద్ధరణ లేక సీనియారిటీ కోల్పోయే ఇబ్బంది తొలగింది.

**ఇలా చేయండి..**

విద్యార్థులు, నిరుద్యోగులు ఎంప్లాయిమెంట్.తెలంగాణ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఇంటి నుంచి స్వయంగా గాని, మీసేవా కేంద్రాల ద్వారా గాని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు ఆయా



పత్రాలను పరిశీలించి సరిగా ఉంటే వెంటనే ఆమోదిస్తారు. ప్రభుత్వ కార్యాలయాల్లోని ఖాళీల సమాచారం జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయాలకు అందుతుంది. ఉపాధి కార్డు పొందిన సీనియర్లకు ప్రాధాన్యం ఇస్తారు.

**జిల్లాలో ఇలా..**

జనాభా: 7,67,428
యువత: 1,21,250
ఇప్పటి వరకు కార్డు తీసుకున్న వారు: 6821

**54 ఏళ్ల వరకు..**

రామరాజు, ఉపాధి కల్పన శాఖ జిల్లా అధికారి

ప్రస్తుతం ఉపాధి కల్పన శాఖ ద్వారా విద్యార్థులు, నిరుద్యోగులకు అందజేస్తున్న కార్డులు 54 ఏళ్ల వరకు పని చేస్తుంది. ఆ తర్వాత పునరుద్ధరణ చేసుకోవచ్చు. ఈ విధానం 2022 డిసెంబరు నుంచి అందుబాటులోకి వచ్చింది. ఇటీవల కాలంలో కార్డుల ప్రాధాన్యం పెరగడంతో యువత వీటిపై ఆసక్తి చూపుతున్నారు. చదువుకున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.




పుణె: మహారాష్ట్రలోని తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో జనవరి 30న నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నాహజారే వెల్లడించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న లోకాయుక్త చట్టాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యిందని ఆయన ఆరోపించారు. ప్రజా సంక్షేమానికి ఈ చట్టం చాలా కీలకమని.. అయితే పదే పదే హామీలు ఇచ్చినప్పటికీ దానిని విస్మరిస్తున్నారని అన్నారు.

ప్రభుత్వ తీరుకు నిరసనగా తాను నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు 88 ఏళ్ల హజారే తెలిపారు. ఇప్పుడు తాను చేపట్టే నిరాహార దీక్షయే తన ఆఖరి నిరసన అవుతుందేమోనన్నా రు. లోకాయుక్త చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అన్నా హజారే 2022లో తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో నిరాహార దీక్ష చేశారు. లోకాయుక్తను అమలు చేస్తామని అప్పటి ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతో నిరసనను ఉపసంహరించుకున్నారు. ఆ తర్వాత ఓ కమిటీ చట్టాన్ని రూపొందించింది. ఈ బిల్లును మహారాష్ట్ర శాసనసభలోని ఉభయ సభలు ఆమోదించి, రాష్ట్రపతి ఆమోదం కోసం పంపాయి. అయితే.. ఈ చట్టం ఇంకా క్షేత్రస్థాయిలో అమలు కాలేదని అన్నాహజారే పేర్కొన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి ఫడణవీస్‌కు తాను ఏడు లేఖలు రాసినప్పటికీ ఆయన నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో తాను నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. ఇన్నేళ్లవుతున్నా మహారాష్ట్ర ప్రభుత్వం లోకాయుక్త చట్టాన్ని క్షేత్రస్థాయిలో ఎందుకు అమలు చేయట్లేదో తెలియట్లేదని విమర్శించారు.




## విశాఖ కాగ్నిజెంట్‌లో 25 వేల మందికి ఉద్యోగాలు: సీఈవో రవి కుమార్

విశాఖపట్నం, డిసెంబర్ 12: విశాఖపట్నం రావడం తన సొంతింటికి వచ్చినట్లుగా ఉందని కాగ్నిజెంట్ సంస్థ సీఈవో రవికుమార్ వెల్లడించారు. విశాఖపట్నం నగరం భవిష్యత్తులో ఎ.ఐ హబ్‌గా మారుతుందన్నారు. శుక్రవారం విశాఖపట్నంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తో కలిసి శంకుస్థాపన కార్యక్రమంలో కాగ్నిజెంట్ టెక్నాలజీ సంస్థ సీఈవో రవి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ రవి కుమార్ మాట్లాడుతూ.. విశాఖపట్నంలోని కాగ్నిజెంట్ సంస్థలో 25 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని వెల్లడించారు. ముందుగా 8 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని ఒప్పందం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. తాము జీసీసీ సెంటర్ సైతం ఏర్పాటు చేస్తామని చెప్పారు. విశాఖపట్నంలో కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్, సత్వా సంస్థతోపాటు మరో ఏడు ఐటీ సంస్థలకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తోపాటు కాగ్నిజెంట్ సంస్థ ప్రతినిధులు కలిసి భూమి పూజ చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి విశాఖపట్నం కేంద్రంగా మారబోతోందన్నారు. ఎకనమిక్ రీజియన్ కింద నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ కాగ్నిజెంట్ సంస్థకు భారత్‌లో ఐదు సెంటర్లు చెన్నై, హైదరాబాద్, పుణె, బెంగళూరు, కోల్‌కతా ఉన్నాయని గుర్తు చేశారు. అంతేకాదు.. హెల్త్ సైన్సెస్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ప్రొడక్ట్ అండ్ రిసోర్సెస్ రంగాల్లో ఈ సంస్థ ఉందని వివరించారు. భారత్ నుంచే దాదాపు రెండున్నర లక్షల మంది ఈ సంస్థలో పని చేస్తున్నారని తెలిపారు. వీరిలో 80 శాతం మంది భారతీయులేనని పేర్కొన్నారు. సంస్థ చీఫ్ సైతం మన దేశానికి చెందిన వ్యక్తి కావడం.. అది మన భారతీయుల శక్తి అని అభివర్ణించారు.

ఇక మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. కాగ్నిజెంట్ పెట్టుబడులతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఐటీ సంస్థల పెట్టుబడులతో విశాఖకు మరింత వెలుగు వచ్చిందని చెప్పారు. పెట్టుబడులు పెట్టేవారికి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మారామన్నారు. రాయితీ ప్యాకేజీపై గురువారం జరిగిన కేబినెట్ భేటీలో సైతం చర్చించామని గుర్తు చేశారు. విజనరీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో పని చేయడం అదృష్టమన్నారు.

## మా గ్రామానికి రోడ్డు కావాలి: పవన్‌తో అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక



అమరావతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచ కప్ సాధించిన భారత మహిళల అంధుల క్రికెట్ జట్టును మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో పవన్ కలిశారు. ఈ విజయం దేశానికే గర్వకారణమని పవన్ కొనియాడారు. ప్రపంచ కప్ సాధించిన క్రికెటర్లను అభినందించిన ఆయన.. ఒక్కో క్రికెటర్‌కు రూ.5 లక్షల చొప్పున, శిక్షకులకు రూ.2 లక్షలు చొప్పున చెక్కులు అందించారు. క్రికెటర్లందరికీ పట్టు చీర, జ్ఞాపిక, కొండపల్లి బొమ్మలు, అరకు కాఫీతో కూడిన బహుమతులను అందించి సత్కరించారు. అంధ క్రికెటర్ల ప్రాక్టీస్ కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, అన్ని విధాలా అండగా నిలవాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు స్వయంగా విజ్ఞప్తి చేస్తానని పవన్ హామీ ఇచ్చారు. మహిళా క్రికెటర్లు చెప్పిన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ప్రపంచకప్ గెలిచిన జట్టులో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణులు దీపిక, పాంగి కరుణ కుమారి ఉండటం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జట్టు కెప్టెన్ దీపిక.. సత్యసాయి జిల్లాలోని తన స్వగ్రామం హేమావత్ పంచాయతీ తంబలహట్టి తండాకు రహదారి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

దీంతో ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ ఆదేశించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన క్రికెటర్ కరుణకుమారి చేసిన విజ్ఞప్తులపైనా తక్షణమే చర్యలు ప్రారంభించాలన్నారు.

## వెలిగొండ ప్రాజెక్టులో జగన్ మోసం తెలియాలనే రైతులతో కలిసి సమీక్ష: నిమ్మల



పెద్దదోర్నాల: ప్రకాశం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్ట్ టన్నెల్ లైనింగ్ పనులను రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. స్థానిక రైతులతో కలిసి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీలతో సమీక్ష నిర్వహించారు. టన్నెల్‌లో 18 కి.మీ ప్రయాణించి క్లిష్టమైన లైనింగ్ పనులను పర్యవేక్షించారు. అనంతరం మంత్రి రామానాయుడు మీడియాతో మాట్లాడారు. "వెలిగొండ ప్రాజెక్టులో జగన్ చేసిన తప్పిదాలు, దగా, మోసం, జిల్లా రైతులకు తెలియాలనే.. రైతులతో కలసి సమీక్ష నిర్వహించాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హెడ్ రెగ్యులేటర్‌లో 2,200 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు, 18 నెలల్లోనే టన్నెల్‌లో క్లిష్టమైన 3 కి.మీ లైనింగ్ పనులు పూర్తి చేశాం. ప్రస్తుతం 4 గ్యాంట్రీలతో రోజుకు 12 మీటర్ల లైనింగ్ పనులు చేస్తుండగా, గ్యాంట్రీల సంఖ్య పెంచి లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని ఏజెన్సీని ఆదేశించాం. ఫీడర్ కెనాల్‌లో 45వేల క్యూబిక్ మీటర్ల హార్డ్ రాక్ పనులు చేయాల్సి ఉండగా.. ఇప్పటికే 28వేల క్యూబిక్ మీటర్ల పనులు పూర్తి చేశాం. ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం రూ.456 కోట్లతో టెండర్లు పూర్తి చేశాం. ఈ డిసెంబర్‌లోనే పనులు మొదలు పెట్టి, సీజన్ వచ్చేలోపు పూర్తి చేయాలని ఏజెన్సీని ఆదేశించాం. తీగలేరు కెనాల్‌కు సంబంధించి 600మీటర్ల టన్నెల్ లైనింగ్ చేసి, గేట్లు ఏర్పాటు చేస్తున్నాం. నల్లమల సాగర్ ముంపుతో 9.6 కి.మీ పర్మినెంట్ డైవర్షన్ రోడ్డు నిర్మాణ పనులు మొదలుపెట్టాం. మొంథా తుపాను కారణంగా దెబ్బతిన్న ఫీడర్ కెనాల్ గండ్లు పూడ్చి, జంట సొరంగాల్లో డీవాటరింగ్ పనులను పూర్తి చేసి, లైనింగ్ పనులు చేస్తున్నాం. జగన్ వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసే నాటికి ఇంకా రూ.4వేల కోట్ల విలువైన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టు పూర్తి కాకుండానే, పూర్తి చేసినట్టు జాతికి అంకితం చేసి దగా, మోసానికి జగన్ బ్రాండ్ అంబాసిడర్ అయ్యారు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా.. జగన్ విధ్వంసం చేసిన ఇరిగేషన్ రంగాన్ని చంద్రబాబు గాడిలో పెట్టారు. వెలిగొండ ప్రాజెక్టును ప్రాధాన్యత ప్రాజెక్టుగా గుర్తించి పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు" అని మంత్రి నిమ్మల తెలిపారు.



## పంట కాల్వలోకి దూసుకెళ్లిన ఆటో: ముగ్గురి మృతి

కొల్లూరు: బాపట్ల జిల్లా కొల్లూరు మండలం దోనేపూడి వద్ద ఆటో పంటకాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొబ్బరికాయల లోడుతో కొల్లూరు నుంచి వెల్లటూరు వైపు వెళ్తోన్న ఆటో అదుపుతప్పి పంట కాల్వలోకి దూసుకెళ్లింది. మృతులను చింతమోటు గ్రామానికి చెందిన చాట్రగడ్డ కాంతారావు (48) పెసర్లంక శ్రీనివాసరావు(55), షేక్ ఇస్మాయిల్(55)గా గుర్తించారు. ఘటనపై కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలిని స్థానిక ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పరిశీలించి, బాధితులకు ధైర్యం చెప్పారు.




## చైనా వృత్తి నిపుణులకు గేట్లు బార్లా.. వీసా నిబంధనల్లో భారత్ సడలింపులు..!

చైనా వృత్తి నిపుణులకు సాధ్యమైనంత వేగంగా బిజినెస్ వీసాలు ఇచ్చేలా భారత ప్రభుత్వం నిబంధనల్లో మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ఇరుదేశాల మధ్య సంబంధాలు బలోపేతం అయ్యేందుకు ఇది కీలక అడుగు కానుంది. సంబంధిత అధికారులు వెల్లడించిన వివరాలను బట్టి జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ సడలింపుల వల్ల వీసా జాప్యాలు ఉండవని, దాంతో వ్యాపారాలకు నిపుణుల కొరత లేకుండా చూసుకోవచ్చని వెల్లడించాయి. వీసా ఆమోద సమయాన్ని నాలుగు వారాల్లోపునకు కుదించడంతో పాటు కొన్ని పరిశీలన స్థాయిల్ని తొలగించారని అధికారులు వెల్లడించారు. రష్యా చమురు కొనుగోలు చేస్తున్నామనే నెపంతో అమెరికా భారత్‌పై భారీగా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఆ నేపథ్యంలోనే ఆగస్టులో షాంఘై సహకార సంస్థ సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. ప్రపంచ శాంతి, శ్రేయస్సు కోసం కలిసి పనిచేయాలని ఆ సందర్భంగా ఇద్దరు నేతలు పిలుపునిచ్చారు. సరిహద్దు వివాదాలు పక్కనపెట్టి అన్ని రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో తాజా అడుగు పడింది. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత చైనీయులకు ఇచ్చే వీసాలపై కఠిన ఆంక్షలు విధించింది. బిజినెస్ వీసాల పరిశీలనను తీవ్రతరం చేసింది. వీసాలు పొందడంలో ఎదురయ్యే సమస్యలు పరిష్కారం అయ్యాయని సదరు అధికారులు పేర్కొన్నారు.

## ఏపీ అభివృద్ధికి ప్రధాని మోదీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు



ఢిల్లీ, డిసెంబరు12 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 16 నెలల పాలనలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేసి చూపించారని తెలుగుదేశం పార్టీ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, సీఎం చంద్రబాబు పాలనపై చాలా విశ్వాసంగా ఉన్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి చెందుతోందని.. మంచి ఫ్యూచర్ ఉందని ప్రధాని ప్రశంసించారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇవాళ(శుక్రవారం) ఢిల్లీ వేదికగా మీడియాతో మాట్లాడారు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు. ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన విందుకు తాను హాజరయ్యానని తెలిపారు. ప్రధాని తనను చూసి బాగున్నారా అని పలకరించారని చెప్పుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తున్నారని ప్రధానికి ధన్యవాదాలు చెప్పానని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా తాను చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నానని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివద్ధిపై ప్రధానికి ఉన్న అభిప్రాయాన్ని తెలియజేశారని అన్నారు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు. ప్రధాని మోదీని బీజేపీ ఎంపీలు కలిసినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి బాగా పనిచేస్తోందని వారి ముందు ప్రస్తావించారని పేర్కొన్నారు. బీజేపీ ఎంపీల ముందు చంద్రబాబును ప్రశంసించడం అభినందనీయమని తెలిపారు. ఏపీ అభివద్ధిపై వైసీపీ నేతలకు ఇప్పటికైనా జ్ఞానోదయం కలగాలని హితవు పలికారు. జగన్‌కి ప్రజలు ఐదేళ్లు అధికారం ఇచ్చారని.. కానీ ఐదేళ్లలో ఏమి చేయలేకపోయారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు.

## సోషల్ మీడియాలో ట్రోలింగ్స్.. హైకోర్టును ఆశ్రయించిన పవన్ కల్యాణ్



న్యూఢిల్లీ: ఈ మధ్య కాలంలో సోషల్ మీడియా వాడకం విపరీతంగా పెరిగిపోయింది. అయితే, సోషల్ మీడియా అతి వాడకం వల్ల ఎక్కువ శాతం మంది జీవితాలు అగమ్యగోచరంగా తయారు అయ్యాయి. సోషల్ మీడియాకు అడిక్ట్ అయిపోయిన జనం జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొంతమంది సోషల్ మీడియాను అడ్డాగా చేసుకుని సెలెబ్రిటీలపై దారుణమైన పోస్టులు పెడుతున్నారు. అసభ్యకరమైన పోస్టులతో పెచ్చు మీరి విలయతాండవం చేస్తున్నారు. సెలెబ్రిటీల పర్సనల్ విషయాలపై కూడా పోస్టులు పెడుతున్నారు. వారి పరువుకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సెలెబ్రిటీలు కోర్టులను ఆశ్రయిస్తున్నారు.

**ఢిల్లీ హైకోర్టుకు ఉప ముఖ్యమంత్రి....** జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. సోషల్ మీడియా వేదికగా తన వ్యక్తిత్వ, హక్కులను ఉల్లంఘించేలా వ్యవహరిస్తున్నారని అంటూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పోస్టుల కారణంగా తన వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం వాటిల్లుతుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ తరఫున సీనియర్ న్యాయవాది సాయి దీపక్ పిటిషన్ దాఖలు చేశారు. వారం రోజుల్లో ఉల్లంఘనకు సంబంధించిన వివరాలను సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని మెటా, గూగుల్, ఎక్స్‌కు ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ డిసెంబర్ 22కు వాయిదా వేసింది.

## సీఎం చంద్రబాబును కలిసిన దేవినేని ఉమా.. కీలక అంశాలపై చర్చ



అమరావతి, డిసెంబరు12 : చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రిని ఇవాళ(శుక్రవారం) దేవినేని ఉమా కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ ప్రాంత రైతుల చిరకాల స్వప్నమైన చింతలపూడి ఆవశ్యకత గురించి సీఎంకు వివరించారు. గోదావరి జలాలు ఈ ప్రాంతానికి వస్తే రైతులు ఇక్కట్లు తీరి సిరుల పంటలు పండుతాయని చెప్పుకొచ్చారు. ఉమ్మడి కృష్ణ, ఉభయ గోదావరి జిల్లాల్లోని 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. 35 మండలాల్లోని 25 లక్షల మందికి పైగా ప్రజలకు తాగునీరు అందిస్తోందని వెల్లడించారు.

ఈ బృహత్తర పథకానికి గత తెలుగుదేశం హయాంలో శంకుస్థాపన చేసి శరవేగంగా పనులు జరిగాయని వివరించారు. ఇప్పటికే ఈ పథకానికి రూ. 4,170 కోట్లు వ్యయం చేశారని తెలిపారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని చెప్పుకొచ్చారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ అసమర్థ, అవినీతి పాలనలో ఆగిపోయిన ఈ ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులను అధిగమించి పూర్తి చేస్తామని దేవినేని ఉమా పేర్కొన్నారు.

## రిసార్ట్ లో ప్రగ్యా హొయలు.. హాట్ ట్రీట్ కి ఫ్యాన్స్ గుండెల్లో గుబులు!

ప్రగ్యా జైస్వాల్.. సినిమాల కంటే నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ప్రేక్షకులను అలరించే ఈ ముద్దుగుమ్మ.. ఎప్పటికప్పుడు తన హాట్ ట్రీట్ తో కుర్రకారు గుండెల్లో గుబులు పుట్టిస్తోంది అనడంలో సందేహం లేదు. ఇందులో భాగంగానే తాజాగా ఫ్యామిలీ, ఫ్రెండ్స్ తో కలిసి వెకేషన్ లో భాగంగా ఒక రిసార్ట్ కు వెళ్లిన ఈమె.. అక్కడ తన అందాలతో హాట్ ఫోజులతో కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తోందని చెప్పవచ్చు. తాజాగా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రగ్యా జైస్వాల్ షేర్ చేసిన ఈ ఫోటోలు చూసి అభిమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా సీబ్లూ, ఎల్లో కలర్ కాంబినేషన్ లో షర్టు, షార్ట్ ధరించి తన అందాలతో మెస్మరైజ్ చేసిన ఈమె.. మరో ఫోటోలో బికినీ అందాలతో ఆశ్చర్యపరిచింది. ఇంకొన్ని ఫోటోలలో షిప్పులో ఫ్యామిలీ, ఫ్రెండ్స్ తో ఎంజాయ్ చేస్తున్న ఫోటోలు అలాగే రిసార్ట్ లో వారు ఇష్టంగా తీసుకున్న డెసర్ట్ కు సంబంధించిన ఫోటోలను కూడా ప్రగ్యా జైస్వాల్ షేర్ చేసింది. ఇక ప్రస్తుతం వెకేషన్ లో ఈమె చిల్ అవుతూ ఎంజాయ్ చేస్తున్న మూమెంట్స్ కి సంబంధించిన ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫోటోలలో ప్రగ్యా జైస్వాల్ ను చూస్తుంటే ఈమె ఏ రేంజ్ లో వెకేషన్ ని ఆస్వాదిస్తుందో అర్థం అవుతోంది అంటూ కామెంట్లు చేస్తున్నారు.



మొత్తానికైతే ఇలా వెకేషన్స్ తో తన మైండ్ ను మరింత రీఫ్రెష్ చేసుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. ప్రగ్యా జైస్వాల్ విషయానికి వస్తే.. మధ్యప్రదేశ్ లోని జబల్పూర్ లో జన్మించిన ఈమె.. పూణేలోని సింబయాసిస్ లా స్కూల్లో చదివింది. సింబయాసిస్ విశ్వవిద్యాలయంలో చదువుతున్నప్పుడు వివిధ రకాల అందాల పోటీలలో పాల్గొని విజయాన్ని అందుకున్న ఈమె.. క్రమంగా మోడల్గా ఎదిగింది. కళా , సంస్కృతి రంగంలో ఈమె సాధించిన విజయానికి 2014 జనవరి 22న సింబయాసిస్ సాంస్కృతిక్ పురస్కారం లభించింది . కాలక్రమేనా మోడల్గా అవతరించిన ప్రగ్యా జైస్వాల్ ఫెమినా మిస్ ఇండియా 2018 పోటీలలో పాల్గొని.. మిస్ ఫ్రెష్ ఫేస్, మిస్ డ్యాన్సింగ్ క్వీన్, మిస్ ఫ్రెండ్ ఆఫ్ ఎర్త్ వంటి టైటిల్స్ ను సొంతం చేసుకుంది. మిలీనియం హైపర్ మార్కెట్ ఫర్ దుబాయ్, డాబర్ వాటిక, ఎఫ్బిబి, రిలయన్స్ డిజిటల్ వంటి పాపులర్ బ్రాండ్స్ కు అంబాసిడర్ గా కూడా పనిచేసింది. ఇక మరొకవైపు సినీ రంగంలోకి కూడా అడుగుపెట్టింది ఈ ముద్దుగుమ్మ. 2015లో ఒకేసారి తెలుగు, హిందీ, తమిళ్ భాషలలో చిత్రాలు చేసి సినీ రంగంలోకి అరంగేట్రం చేసింది. అలా 2015లో మిర్చి లాంటి కుర్రాడు అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. క్రిష్ దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా వచ్చిన కంచె సినిమాలో హీరోయిన్గా నటించి భారీ పాపులారిటీ అందుకుంది. అంతేకాదు ఇందులో ఉత్తమ నటన కనబరిచినందుకు ఈమెకు ఉత్తమ నటి విభాగంలో గద్దర్ అవార్డు కూడా లభించింది. అఖండ, డాకు మహారాజ్ సినిమాలతో ప్రేక్షకులను అలరించింది ఈ ముద్దుగుమ్మ.

## ప్రియాంక వారియర్ లో ఈ టాలెంట్ కూడా ఉందా.. అదరగొట్టేసిందిగా?

ప్రియా ప్రకాష్ వారియర్.. ఈ పేరు గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. గత కొన్ని సంవత్సరాల క్రితం జాతీయస్థాయిలో సంచలనంగా మారింది ఈ ముద్దుగుమ్మ. ఒక్క కన్ను గీటుతో అబ్బాయిల మనసులను దోచుకుంది. అడపాదడపా సినిమాలలో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ఈమె.. మరొకసారి వార్తల్లో నిలిచింది అని చెప్పవచ్చు. తాజాగా తనలో దాగి ఉన్న మరో టాలెంట్ ని బయటపెట్టి అందరినీ ఆకర్షించింది. అసలు విషయంలోకి వెళ్తే.. తాజాగా ప్రదీప్ రంగనాథన్ , మమిత బైజు జంటగా నటించిన చిత్రం డ్యూడ్. ఈ సినిమాల్లో భారీ హిట్ గా నిలిచిన ఊరం బ్లడ్ అనే కవర్ పాటను చాలా క్యాజువల్ గా పాడి అందరి దృష్టిని ఆకట్టుకుంది. ముఖ్యంగా మనోహరమైన స్వరంతో పాట పాడి



అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇందులో సింపుల్ లుక్ లో కనిపిస్తూనే తన మధురమైన గాత్రంతో అందరి దృష్టిని ఆకట్టుకుంది.. ప్రస్తుతం ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో.. మైత్రి మూవీ మేకర్స్ కూడా ఈమె వీడియోని తిరిగి షేర్ చేస్తూ.. "ది చార్ట్ బస్టర్ ఊరం బ్లడ్ ఫ్రమ్ డ్యూడ్ ఇన్ వాయిస్ ఆఫ్ ప్రియా వారియర్" అంటూ లవ్ ఎమోజిని కూడా షేర్ చేశారు. మొత్తానికైతే "టైం లెస్ బ్యూటీ" అంటూ అభిమానుల చేత ప్రశంసలు పొందుతోంది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో ప్రియాలో ఈ టాలెంట్ కూడా ఉందా అంటూ కామెంట్లు చేస్తున్నారు. ప్రియా ప్రకాష్ వారియర్ విషయానికి వస్తే.. ఒరు అధార్ లవ్ అనే చిత్రం ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైన ఈ ముద్దుగుమ్మ.. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇకపోతే ఈ సినిమా తర్వాత పోలీస్ కేసు కూడా ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలోని ఒక పాటలోని అంశాలు ముస్లిం మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయి అంటూ ఫిర్యాదు చేశారు. దీంతో ఆ చిత్ర దర్శకుడిపై కూడా హైదరాబాదులో కేసు నమోదు అయింది. వివిధ రాష్ట్రాలలో కూడా ఫిర్యాదులు అందిన నేపథ్యంలో తనదైన స్టైల్ లో ఈ పాటపై వివరణ ఇచ్చినా.. ఇబ్బందులు ఎదుర్కోక తప్పలేదు. ముఖ్యంగా 1978 నాటి ఒక పాత జానపద గీతం నుంచే ఈ పాటను తీసుకున్నామని అందులో భావాలను అర్థం చేసుకోకుండా.. లోతుల్లోకి వెళ్ళకుండా.. వక్రీకరించి ఎవరో ఫిర్యాదు చేశారని ఆమె తెలిపింది.




## కార్తీ 'అన్నగారు వస్తారు' .. ఆ సమస్యే మళ్లీ..



కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ నటించిన లేటెస్ట్ మూవీ వా వాతియార్ (అన్నగారు వస్తారు). నలన్ కుమారస్వామి దర్శకత్వం వహించిన సినిమా.. అప్పుడెప్పుడో రిలీజ్ కావాల్సి ఉంది. కానీ వివిధ కారణాల వల్ల విడుదల అవ్వలేదు. డిసెంబర్ 5వ తేదీన రిలీజ్ అవుతుందని కొన్ని రోజుల క్రితం మేకర్స్ ప్రకటించారు. ప్రమోషన్స్ కూడా నిర్వహించారు. కానీ బాలయ్య అఖండ 2 తాండవం మూవీ అదే డేట్ కు ముందు షెడ్యూల్ అవ్వడంతో అన్నగారు వస్తారు మేకర్స్ తమ సినిమాను వాయిదా వేశారు.

ఆ తర్వాత డిసెంబర్ 12వ తేదీన విడుదల చేస్తామని ప్రకటించారు. అన్ని ఏర్పాట్లు కూడా చేశారు. కానీ ఇప్పుడు సినిమా రిలీజ్ ను నిలిపివేయాలని మద్రాసు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే అఖండ 2 నిర్మాణ సంస్థకు తలెత్తిన సమస్య లాంటిదే ఇప్పుడు అన్నగారు వస్తారు నిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్ కు కూడా వచ్చింది. నిజానికి అన్నగారు వస్తారు మూవీని నిర్మించిన స్టూడియో గ్రీన్ బ్యానర్ నిర్మాత జ్ఞానవేల్ రాజా.. బిజినెస్ మ్యాన్ అర్జున్ లాల్ వద్ద రూ.10.35 కోట్ల రుణం తీసుకున్నారు. కానీ ఇంకా తిరిగి చెల్లించలేదు. ఇప్పుడు వడ్డీతో కలిసి రుణం రూ.21.78 కోట్లు అయింది. దీంతో మొత్తం డబ్బులు చెల్లించేలా ఆదేశాలివ్వాలని రీసెంట్ గా అర్జున్ లాల్.. మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. వడ్డీతో సహా చెల్లించే వరకు అన్నగారు వస్తారు సినిమా విడుదలపై స్టే విధించాలని పిటిషన్ దాఖలు చేశారు. దీంతో కోర్టు.. నేడు విచారణ జరిపింది. న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.ఎం. సుబ్రహ్మణ్యం, జస్టిస్ కుమారప్పతో కూడిన ధర్మాసనం.. అర్జున్ లాల్ పిటిషన్ ను విచారించింది. అన్నగారు వస్తారు మూవీ రిలీజ్ పై మధ్యంతర స్టే విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఇప్పటికే కోర్టు అనేక సార్లు అవకాశం ఇచ్చినప్పటికీ జ్ఞానవేల్ రాజా అప్పు తిరిగి ఇవ్వలేదని పిటిషనర్ తరఫు లాయర్ వాదించారు. ఆయన ఆస్తులు జప్తు చేయాలని కోరారు.

దీంతో మద్రాసు హైకోర్టు.. జ్ఞానవేల్ రాజాకు ఇప్పటికే అనేక సార్లు అవకాశం ఇచ్చామని తెలిపింది. మళ్లీ అవకాశం ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్పింది. అందుకే అప్పు తిరిగి చెల్లించే వరకు సినిమాను విడుదల చేయకూడదని నిషేధం విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అదే సమయంలో స్టూడియో గ్రీన్ సోషల్ మీడియాలో రెస్పాండ్ అయింది. త్వరలోనే విడుదల అంటూ పోస్టు పెట్టింది. మరి అన్నగారు వస్తారు మూవీ.. ఎప్పుడు వస్తుందో చూడాలి.

## మల్టీస్టారర్ సినిమాకు డైరెక్టర్ కష్టాలు..?



కోలీవుడ్ స్టార్స్ మాత్రమే కాదు పాన్ ఇండియా లెవెల్ లో సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉన్న కథానాయకులు సూపర్ స్టార్ రజినీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్. ఇద్దరు వారి వారి సినిమాలతో కొన్ని దశాబ్దాలుగా సినీ లవర్స్ ని అలరిస్తూ వస్తున్నారు. కోలీవుడ్ పరిశ్రమకు ఈ ఇద్దరు ఇచ్చిన కాంట్రిబ్యూషన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇప్పటికీ అక్కడ స్టార్స్ కి ధీటుగా సినిమాలు చేస్తూ వస్తున్నారు ఈ ఇద్దరు స్టార్స్.

**రజనీ, కమల్ ఇద్దరు కెరీర్ మొదట్లో..** ఐతే రజనీ, కమల్ ఇద్దరు కెరీర్ మొదట్లో కలిసి నటించారు. ఇద్దరికి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఏర్పడి.. సూపర్ స్టార్స్ అయ్యాక కలిసి నటించలేదు. కనీసం స్క్రీన్ షేర్ చేసుకోలేదు. అందుకే ఇన్నాళ్లకు ఆ కాంబినేషన్ పై గురి కుదిరింది. కమల్, రజనీ ఇద్దరు కూడా కలిసి నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వేరు వేరు సందర్భాల్లో రజనీతో సినిమా ఉంటుందని కమల్.. కమల్ హాసన్ తో సినిమా చేస్తున్నా అని రజనీ చెప్పారు. ఈ ఇద్దరు హీరోలను కలిసి సినిమా తీసే డైరెక్టర్ ఎవరన్నది మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. అసలైతే లోకేష్ కనకరాజ్ డైరెక్షన్ లో ఈ సినిమా వస్తుందని అనుకున్నారు. కానీ కూలీ ఇచ్చిన షాక్ వల్ల ఆ ఛాన్స్ మిస్ చేసుకున్నాడు లోకేష్. మరోపక్క యువ దర్శకుడు, హీరో ప్రదీప్ రంగనాథన్ కి ఈ ఛాన్స్ ఇస్తున్నారంటూ వార్తలు వచ్చాయి. కానీ అందులో ఏమాత్రం నిజం లేదని క్లారిటీ వచ్చింది.

**ఈ కాంబినేషన్ సినిమా హ్యాండిల్ చేసే ఛాన్స్..** కార్తీక్ సుబ్బరాజ్ కూడా డిస్కషన్ లో ఉన్నా రెట్రో ఫ్లాప్ తర్వాత అతను కూడా ఈ మల్టీస్టారర్ కు రెడీగా ఉన్నట్టు కనిపించట్లేదు. ఐతే ఫైనల్ గా ఒక డైరెక్టర్ ఈ కాంబినేషన్ సినిమా హ్యాండిల్ చేసే ఛాన్స్ ఉందని అంటున్నారు. అతను ఎవరో కాదు నెల్సన్ దిలీప్ కుమార్. సూపర్ స్టార్ రజినీతో జైలర్ సినిమా తీసి సెన్సేషనల్ హిట్ అందుకున్నాడు నెల్సన్. ప్రస్తుతం రజినీతో జైలర్ 2 చేస్తున్నాడు నెల్సన్. ఈ సినిమా తర్వాత రజనీ, కమల్ మల్టీస్టారర్ కూడా ఆయనే డైరెక్ట్ చేసే ఛాన్స్ ఉందని తెలుస్తుంది. లోకేష్, కార్తీ, ప్రదీప్ ఇలా వీళ్లందరి కన్నా నెల్సన్ తోనే ఈ మల్టీస్టారర్ చేయాలని అనుకుంటున్నారట. నెక్స్ట్ అనౌన్స్ మెంట్ రావడమే లేట్ అంటున్నారు. ఐతే రజనీ, కమల్ సినిమాను నెల్సన్ తీస్తే ఎన్టీఆర్ తో తను చేసే సినిమా ఇంకా లేట్ అయ్యే ఛాన్స్ ఉంది. ఐతే ఎలాగు ఎన్టీఆర్ నీల్ తో చేసే సినిమా తర్వాత త్రివిక్రం సినిమా ఉంటుంది కాబట్టి సమస్య ఉండకపోవచ్చని తెలుస్తుంది.

## వెంకీ చేతిలో బ్యాగ్ మల్లీశ్వరి 2.0!

విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రానికి ఆదర్శ కుటుంబం హౌస్ నెంబర్ 47 గా ఖరారైన సంగతి తెలిసిందే. టైటిల్ ని బట్టే ఇది పక్కా ఫ్యామిలీ ఎంటర్ అని కన్ఫమ్ అయింది. ఇద్దరి కాంబినేషన్ లో ఇలాంటి సినిమానే ఉంటుందని ముందు నుంచి మీడియాలో కథనాలొస్తూనే ఉన్నాయి. ఇప్పుడవి నిజమయ్యాయి. ఫ్యామిలీ కథల్లో వెంకీ పాత్రలు ఎలా ఉంటాయో చెప్పాల్సిన పనిలేదు. ఎంతో ఆహ్లాదంగా సరదాగా సాగిపోతుంటాయి. ఈ కాంబినేషన్ లో సీన్స్ ఎలా ఉంటాయి? డైలాగులు ఎలా ఉంటాయి? అన్నది మల్లీశ్వరితో అందిరికీ తెలిసిందే.

**మల్లీశ్వరి కథలోకి వెళ్లాల్సిందే:** కాకపోతే ఆసినిమాకు త్రివిక్రమ్ రైటర్ గా మాత్రమే పని చేసారు. ఈ నేపథ్యంలో ఇద్దరు కలిసి సినిమా చేస్తున్నారంటే? మల్లీశ్వరికీ సీక్వెల్లా? అన్న ప్రచారం కూడా తెరపైకి వచ్చింది. సీక్వెల్ కాకపోయినా? అలాంటి నేపథ్యమున్న కథతోనే సినిమా తీస్తారు? అని బలమైన నమ్మకం అభిమానుల్లో నెలకొంది.



నిన్నటి ఫస్ట్ లుక్ పోస్టర్ తోనూ క్లియర్ అయింది. ఈ పోస్టర్ లో వెంకటేష్ డీసెంట్ లుక్ లో ఆకట్టుకుంటున్నాడు. చేతిలో ఓ నల్లటి బ్యాగ్ కనిపిస్తుంది. మరి ఈ బ్యాగ్ ప్రత్యేకత ఏంటి? మల్లీశ్వరి కథలోకి వెళ్లక తప్పదు. ఆ సినిమాలో వెంకటేష్ బ్యాక్ ఉద్యోగి పాత్ర పోషిస్తాడు.

**బ్యాగులు రెండూ ఒకేలా:** రోజు బ్యాంక్ కు వెళ్లే సమయంలో ఇదే నల్లటి బ్యాగ్ కనిపిస్తుంది. ప్రత్యేకించి కత్రినాకైఫ్ తో బీచ్ లో ఓ కాంబినేషన్ సన్నివేశం ఉంటుంది. అందులో ఈ నల్లటి బ్యాక్ బాగా హైలైట్ అవుతుంది. ఇప్పుడా బ్యాగ్...తాజా పోస్టర్ లో ఉన్న బ్యాగ్ సరి పోల్చితే రెండు ఒకటే కదా? అన్న సందేహం రాకమానదు. ఆ రెండు బ్యాగులు ఒకేలా ఉన్నాయి. బ్యాగ్ డిజైన్ లో మాత్రం ఎలాంటి మార్పు లేదు. దీంతో మల్లీశ్వరికీ –ఈ కథకు ఏదైనా సంబంధం ఉందా? అన్న సందేహాలు రాక మానవు. ఆదర్శ కుటుంబం హౌస్ నెంబర్ 47 ని మల్లీశ్వరికీ 2.0గా చూడొచ్చు అన్న క్వశ్చన్ రెయిజ్ అవుతుంది.


**ఆదర్శ కుటుంబంపై మల్లీశ్వరి ప్రభావం...** మల్లీశ్వరి రిలీజ్ అయి రెండు దశాబ్దాలు పూర్తయింది. ఇప్పటికీ ఆ సినిమా గురించి చర్చ జరుగుతుందంటే? ఆ సినిమా సాధించిన విజయమే. అందులో ప్రతీ పాత్ర ఎంతో గొప్పగా పండుతుంది. ఇదంతా పక్కన బెడితే? గురూజీ కథలు రకరకాల భాషల సినిమాల నుంచి ఇన్ స్పైర్ అయి రాస్తుంటారనే ఆరోపణలు చాలా కాలంగా ఉన్నాయి.మల్లీశ్వరికీ తానే రైటర్ కాబట్టి ఆ ప్రభావం ఆదర్శ కుటుంబం పై ఎంతో కొంత ఉన్నా? ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు.

## ఆ బాధ నాకు నిద్ర పట్టనివ్వడం లేదు..

హైదరాబాదు నుండి బెంగళూరు బయలుదేరిన వేమూరి కావేరి ట్రావెల్ బస్ కర్నూలుకి 10 కిలోమీటర్ల దూరంలో బైక్ ను ఢీ కొట్టి అత్యంత దారుణంగా దగ్ధమైన విషయం తెలిసిందే. ఇందులో 42 మంది ప్రయాణికులు ఉండగా ఇద్దరు డ్రైవర్లు ఘటన సమయంలో అక్కడి నుండి పారిపోగా.. 42 మందిలో 19 మంది ప్రయాణికులు అగ్నికి ఆహుతి అయ్యారు. ఇక మిగతావారు కిటికీ అద్దాలు పగలగొట్టుకొని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బస్సు నుండి దూకేసి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ ఘటన దేశం మొత్తాన్ని ఆశ్చర్యపరిచింది. ప్రతి ఒక్కరూ కూడా ఈ విషాదకర ఘటనపై విచారణ వ్యక్తం చేస్తున్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ , రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సహా పలువురు ఈ ఘటనపై విచారం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు కేంద్ర ప్రభుత్వంతో పాటు తెలంగాణ ప్రభుత్వం కూడా మృతులకు, ఈ ఘటనలో



గాయపడిన వారికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు ఈ ఘటనపై సినీ సెలబ్రిటీలు కూడా స్పందిస్తున్నారు. ముఖ్యంగా సినీ నటి రష్మిక మందన్న ఎమోషనల్ కామెంట్లు చేశారు. రష్మిక ఈ ప్రమాదం గురించి మాట్లాడుతూ.. కాలిపోయే ముందు ప్రయాణికులు అనుభవించిన భాధ తలుచుకుంటేనే భయంకరంగా ఉంది. ఆ బాధ నాకు నిద్ర కూడా పట్టనివ్వడం లేదు అంటూ ఎమోషనల్ కామెంట్లు చేసింది. ఈ ఘటనపై రష్మిక మాట్లాడుతూ.. "కర్నూలు ప్రమాదవార్త నా హృదయాన్ని ముక్కలు చేసింది. ఎంతో బాధపడ్డాను. మండుతున్న బస్సు లోపల ఆ ప్రయాణికులు అనుభవించిన బాధ వర్ణించలేనిది. ముఖ్యంగా మంటలకు తమ శరీరం కాలిపోతున్నప్పుడు వాళ్ళు ఆ బాధ ఎంత అనుభవించారో ఊహిస్తేనే భయంకరంగా ఉంది. ఇందులో చిన్నపిల్లలతో సహా ఒక కుటుంబమంతా ప్రాణాలు కోల్పోయింది. కుటుంబ సభ్యులను కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను" అంటూ రష్మిక ఎమోషనల్ కామెంట్లు చేసింది.



# ఫోన్ ట్యాపింగ్ కేసు.. సిట్ ఎదుట లొంగిపోయిన ప్రభాకర్‌రావు

హైదరాబాద్: ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావు సిట్ ఎదుట లొంగిపోయారు. శుక్రవారం ఉదయం జూబ్లీహిల్స్ పీఎస్‌కు ఆయన వెళ్లారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆయన సిట్ ఎదుట హాజరయ్యారు. వారం రోజుల పాటు ప్రభాకర్‌రావు కస్టోడియల్ విచారణకు సుప్రీంకోర్టు గురువారం అనుమతి ఇచ్చింది. దాని తర్వాత వచ్చిన రిపోర్టుపై మళ్లీ విచారణ చేస్తామని పేర్కొంది. ఆయనకు భౌతికంగా ఎలాంటి హాని జరగకుండా చూడాలంది. చట్టప్రకారం దర్యాప్తు చేయాలని ఆదేశించింది. ఈక్రమంలో ప్రభాకర్‌రావు సిట్ ఎదుట హాజరయ్యారు.




# ఏకగ్రీవమైన చోట90% కాంగ్రెస్ మద్దతుదారులే
## చాలా చోట్ల బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ చేశాయ్

హైదరాబాద్ : తొలివిడత పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్ద తుదారులు 60%కు మించి విజయం సాధించారని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

మొదటి విడత సర్పంచ్ ఎలక్షన్ లో 4,230 పంచాయతీలకు గాను కాంగ్రెస్ మద్దతుదారులు 2 వేల 600 పైచిలుకు స్థానా ల్లో గెలిచారని చెప్పారు. ఏకగ్రీవం అయిన చోట్ల 90శాతం కాంగ్రెస్ మద్దతు దారులే సర్పంచులు గా ఉన్నారన్నారు. చాలా చోట్ల బీజేపీ బీఆర్ఎస్ కలిసిపోటీచేశాయనిచెప్పారు. వెయ్యికి దగ్గరగా బీఆర్ఎస్, 200 లోపు బీజేపీ, 40 చోట్ల సీపీఎం, 30 స్థానాల్లో సీపీఐ అభ్యర్థులు గెలిచారన్నా రు. రెండో విడత, మూడో విడత ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్ మద్దతు దారులకు పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. జనం కాంగ్రెస్ ప్ర జాపాలనకు అండగా నిలిచారన్నారు.

15 నెలల్లో 80 వేల కొలువులు భర్తీ చేశామని, మహిళలకు ఉచిత బస్సు, సన్నబియ్యం పంపిణీ ప్రజలను ఆకర్షించిందననారు. గ్లోబల్ సమ్మిట్ తో ఊహించని విధంగా 5 లక్షల 75 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని వివరించారు.

# కేబినెట్ హెూదాలపై పిల్.. హైకోర్టు కీలక ఆదేశాలు




హైదరాబాద్, డిసెంబరు12 : కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలతో సహా కొందరికీ కేబినెట్ హెూదా కల్పిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఓ జీవో ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ జీవోను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేత ఏరోళ్ల శ్రీనివాస్ తెలంగాణ హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిల్‌పై ఇవాళ(శుక్రవారం) విచారణ జరిగింది. కాంగ్రెస్ నేతలు కేశవరావు , పోచారం శ్రీనివాసరెడ్డి , సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్, చిన్నారెడ్డిలతోపాటు మరో తొమ్మిది మందికి కేబినెట్ హెూదా చట్ట విరుద్ధమని పిటిషన్‌లో ప్రస్తావించారు. రిజిస్ట్రీ అభ్యంతరం చెప్పడంతో చీఫ్ జస్టిస్ బెంచ్ విచారణ చేపట్టింది. ఎమ్మెల్యేల సంఖ్యలో 15 శాతం మాత్రమే కేబినెట్ హెూదా ఇవ్వాలని వాదనలు వినిపించారు. ముఖ్యమంత్రి, మంత్రులకు మాత్రమే కేబినెట్ హెూదా ఉంటుందని వివరించారు ఏరోళ్ల శ్రీనివాస్. రిజిస్ట్రీ అభ్యంతరాలను తోసి పుచ్చి ఓ నెంబర్ కేటాయించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేబినెట్ హెూదా కల్పించడాన్ని సవాల్ చేస్తూ 2017లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిల్ దాఖలు చేశారని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వేసిన పిల్‌తో పాటు బీఆర్ఎస్ పిటిషన్లను కలిపి వచ్చే వారంలో విచారణకు తమ ముందు ఉంచాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేసింది తెలంగాణ హైకోర్టు.



# మధ్యాహ్న భోజనం తిన్న 44 మంది విద్యార్థులకు అస్వస్థత

హైదరాబాద్: మాదాపూర్ చందానాయక్ తండ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న 44 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో విద్యార్థులను కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఆరుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

**బాగ్‌లింగంపల్లిలో..** హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయిన ఏడుగురు విద్యార్థులు నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రాత్రి భోజనం చేసిన విద్యార్థులు వాంతులు, విరోచనలు, కడుపునొప్పితో బాధపడుతున్నారని, వెంటనే వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించామని గురుకుల పాఠశాల సిబ్బంది తెలిపారు. పిల్లల ఆరోగ్య ప్రస్తుతం నిలకడగానే ఉందని నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ విజయ్ కుమార్ తెలిపారు.



# పెరిగిన చలి తీవ్రత.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా చలిపులి పంజా విసురుతోంది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల వల్ల రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయినట్లు వాతావరణ శాఖ అధికారిణి శ్రావణి తెలిపారు. ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాల్లో చలి గాలుల ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. శుక్రవారం, శనివారం శీతల, అతి శీతల పవనాలు వీచే అవకాశం ఉన్నందున ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు చెప్పారు.

ఎల్లుండి నుంచి పొగ మంచు పెరిగే అవకాశం ఉందన్నారు. శీతల గాలులు, పొగ మంచు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.




# అఖండ 2 టికెట్లపై హైకోర్టు ఆగ్రహం

## అఖండ 2 పిటిషన్‌పై విచారణ.. బుక్ మై షోపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్: ఆన్‌లైన్ సినిమా టికెట్ బుకింగ్ ప్లాట్ ఫామ్ 'బుక్ మై షో'పై తెలంగాణ హైకోర్టు సీరియస్ అయింది. కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకపోవటంతో సదరు సంస్థపై మండిపడింది. గురువారం తెలంగాణ హైకోర్టులో అఖండ 2 సినిమా టికెట్ల ధర పెంపుపై లంచ్ మోషన్ పిటిషన్ దాఖలైంది. ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని కోరుతూ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి ఈ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేసింది. అయితే, కోర్టు తీర్పు ఇచ్చినా బుక్‌మై షోలో పెంచిన ధరకు టికెట్లు అమ్ముడయ్యాయి. దీంతో కోర్టు ఆగ్రహానికి గురైంది. కోర్టు ఉత్తర్వులు అంటే లెక్క లేదా అంటూ మండిపడింది. ఆదేశాలు ఇచ్చినా కూడా ఎందుకు పెంచిన ధరతో టికెట్లను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారని బుక్ మై షోను హైకోర్టు ప్రశ్నించింది. దీనికి సమాధానం ఇస్తూ.. తమకు ఉత్తర్వులు అందే లోపే ప్రేక్షకులు టిక్కెట్లు కొనుగోలు చేశారని బుక్ మై షో కోర్టుకు తెలిపింది. హై కోర్టు స్పందిస్తూ.. ఇప్పుడు పెంచిన రేట్లతో టికెట్లను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారా? లేదా అని ప్రశ్నించింది. ఎందుకు మీ మీద కంటెంప్ట్ యాక్షన్ తీసుకోకూడదో చెప్పాలని అడిగింది.

**ప్రభుత్వ జీవోలో ఏముందంటే..** అఖండ-2 సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు టికెట్ రేట్లు పెంచుకోవచ్చని ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్‌పై 50 రూపాయలు.. మల్టీప్లెక్స్‌లలో 100 రూపాయలు అదనంగా పెంచుకునేందుకు అనుమతి కల్పించింది. డిసెంబర్ 11వ తేదీ ప్రీమియర్ షో టికెట్ ధరను 600 రూపాయలుగా నిర్ణయించింది. సినిమా టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చే లాభాల్లో 20 శాతాన్ని సినీ కార్మికుల సంక్షేమానికి కేటాయించాలని స్పష్టం చేసింది.




# వాళ్లే టార్గెట్‌గా మరోసారి కవిత కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, డిసెంబర్ 12: మాజీ మంత్రి హరీష్ రావు, బీఆర్ఎస్ టార్గెట్‌గా జాగృతి అధ్యక్షురాలు కవిత మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావుతో హరీష్, బీఆర్ఎస్ తనపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతల అక్రమాలు తన దృష్టికి వస్తున్నాయని... అసలు కథ ముందుంది అంటూ కామెంట్స్ చేశారు. 'నేను మంచి దాన్ని కాదు. కాళ్లు విరగొడతాను' అంటూ హెచ్చరించారు. అధికారంలో ఉన్న పదేళ్లలో తాను, తన భర్త ఒక్క పని అయినా అడిగామా అని ప్రశ్నించారు. తాను ఏ తప్పు చేయలేదని.. బీఆర్ఎస్‌లో 10 ఏళ్లలో ఒక్క రూపాయి సంపాదించలేదని స్పష్టం చేశారు. హరీష్ రావు, కేటీఆర్, కేసీఆర్‌ను ఒక్క సహాయం కూడా అడగలేదని తెలిపారు. ఉద్యమంలో ఎవరు ఏమి చేశారనేది తాను ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు వారం రోజుల్లో అపాలజీ చెప్పాలని.. లేదంటే కోర్టుకి ఈడుస్తామని వార్నింగ్ ఇచ్చారు. తనను పార్టీ నుంచి పంపించారని.. అయినా వాళ్ల కళ్ళు చల్లబడలేదా అని వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కిటికీలు తెరిచిందని.. కాంగ్రెస్ డోర్స్ ఓపెన్ చేసిందన్నారు. తనపై ఎవ్వరు ఎలాంటి ఆరోపణలు చేసినా జవాబు చెబుతానన్నారు. బీఆర్ఎస్ హయాంలో చాలా తప్పిదాలు జరిగాయని... అవి తన దృష్టికి వస్తున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ వాళ్ళు తప్పు చేశారనే.. రేవంత్ అధికారంలోకి వచ్చారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన లావాదేవీలకు, కాంగ్రెస్‌కు సంబంధం ఉందని ఆరోపించారు. 'నేను ఏదో ఒక రోజు ముఖ్యమంత్రి అవుతా. హరీష్ రావు.. విజ్ఞత అని తప్పించుకుంటున్నారు. లైన్‌లు నేను దాట లేదు. నేను ఇంకా ఊరుకోను ' అంటూ కవిత సంచలన కామెంట్స్ చేశారు.



# మెస్సీ- సీఎం మ్యాచ్.. టికెట్లు ఉన్నవాళ్లు మాత్రమే రావాలి: సీపీ

హైదరాబాద్: 'మెస్సీ గోట్ ఇండియా టూర్' కోసం పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 13న రాత్రి 7గంటలకు ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్‌లో మెస్సీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ఫుట్‌బాల్ మ్యాచ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. 2500 మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ మ్యాచ్‌కు టికెట్లు ఉన్నవాళ్లు మాత్రమే రావాలని సూచించారు. 34 ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు మెస్సీ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగే కార్యక్రమంలో, తర్వాత ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో పాల్గొంటారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫలక్‌నుమా ప్యాలెస్, ఉప్పల్ స్టేడియం వరకు ప్రయాణించే మార్గాలు ఇప్పటికే ఖరారయ్యాయి. 13వ తేదీ రాత్రి కూడా ఫలక్‌నుమా ప్యాలెస్‌లోనే మెస్సీ బస చేయనున్నారు.




కర్ణాటక రాజకీయాలు కొన్ని నెలలుగా చర్చనీయాంశమ వుతున్నాయి. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దిల్లీ పర్యటనలు, బ్రేక్‌ఫాస్ట్ మీట్‌లు వార్తల్లో నిలుస్తున్నాయి. ఇప్పుడు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ విందు రాజకీయం చేశారు. గురువారం రాత్రి 30 మందికి పైగా ఎమ్మెల్యేలతో కలిసి శివకుమార్ డిన్నర్ చేశారు. వారిలో కొందరు మంత్రులు కూడా ఉన్నారని, కాంగ్రెస్ నేత ప్రవీణ్ ఫామ్‌హౌస్‌లో ఈ మీటింగ్ జరిగిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. భాజపా నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యేలు ఎస్‌టీ సోమశేఖర్, శివరామ్ హెబ్బర్ కూడా ఈ డిన్నర్‌కు వచ్చినట్లు పేర్కొన్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కొందరు మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఒకరోజు ముందు ఇలాంటి డిన్నర్‌లోనే పాల్గొనడం గమనార్హం. వారికి బెళగావి నార్త్ ఎమ్మెల్యే ఫిరోజ్ ఆతిథ్యం ఇచ్చారు. కుర్చీలాట.. రాజకీయ గలాటా... ఇవన్నీ సాధారణ కార్యక్రమాలేనని నేతలు చెబుతున్నారు. "ఎమ్మెల్యే ఇంట్లో జరిగిన విందులో పాల్గొన్నాం. అందులో ప్రత్యేకత ఏమీ లేదు. అదొక స్నేహపూర్వక సమావేశం" అని డీకే అన్నారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కొన్ని రోజులుగా ఊహాగానాలు వినిపిస్తోన్న తరుణంలో ఈ బల ప్రదర్శనలు జరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com